












సుందర రూపిణి.. సుమధుర భాషిణి

లలితా త్రిపుర సుందరికి నీరాజనం | **నాలుగో రోజు దుర్గగుడికి భక్తజన వెల్లువ**

ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. శ్రీచక్ర అధిష్ఠానశక్తిగా, పంచదశాక్షరీ మహామంత్రాది దేవతగా.. లక్ష్మీదేవి, సరస్వతీదేవి ఇరువైపులా వింజామరలతో సేవిస్తూ ఉండగా చిరుమందహాసంతో చెరకుగడను చేతపట్టుకుని శివుని వక్షస్థలంపై కూర్చుని కాంతులీనిన లలితా త్రిపుర సుందరీదేవిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. గత మూడు రోజులతో పోలిస్తే రెట్టింపు సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

వేకువన 4 గంటల నుంచి సాయంత్రం 4 గంటల సమయానికే.. అమ్మవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య 55



వేలు దాటిపోయింది. అప్పటికి ఇంకా కొండ దిగువన వినాయక ఆలయం నుంచి పైవరకూ క్యూలైన్లలో భక్తులు కిక్కిరిసి ఉన్నారు.

నేడు శ్రీ మహా చండీదేవిగా..

దుర్గగుడిలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఐదో రోజు సోమవారం అమ్మవారు శ్రీమహాచండీదేవి రూపంలో దర్శనమివ్వనున్నారు. **దర్శన సమయాలు:** ఉదయం 4నుంచి రాత్రి 11గంటల వరకు.

సాయంత్రం నుంచి మరింత ఎక్కువ రద్దీ పెరిగింది. ఉత్సవాల నాలుగు రోజుల్లో 2.80 లక్షల మంది వరకూ భక్తులు తరలివచ్చి అమ్మను దర్శించుకున్నారు.

భారీగా పెరిగిన ఆదాయం..

ఆదివారం వేకువన 3 గంటల నుంచే క్యూలైన్లు కిక్కిరిశాయి. భక్తుల భారీ రద్దీతో ప్రసాదాలు, దర్శన టిక్కెట్లు, పూజలు, కేశఖండనశాలపై వచ్చే ఆదాయం పెరిగింది. మొదటి రోజు రూ.28 లక్షలు, రెండో రోజు రూ.47 లక్షలు, మూడో రోజు రూ.54 లక్షల ఆదాయం రాగా.. నాలుగో రోజు ఆదివారం సాయంత్రం 5 గంటలకే రూ.70 లక్షల ఆదాయం వచ్చింది. మొత్తంగా నాలుగో రోజు సాయంత్రానికి రూ.2 కోట్ల వరకు ఆదాయం ఆలయానికి వచ్చింది. హుండీ కానుకలు, విలువైన నగలు వీటికి అదనం.



ఈనాడు, డిజిటల్ - అమరావతి, న్యూస్‌టుడే - ఇంద్రకీలాద్రి, భవానీపురం, కృష్ణలంక, చిట్టినగర్

పై వంతెనపైనే.. మెట్రో వారధి

- భూసేకరణ భారం లేకుండానే నిర్మాణం
- సుదీర్ఘ పైవంతెన ఆకృతులే కీలకం...
- మెట్రో, ఎన్‌హెచ్‌ఏఐల సమావేశం నేడు

ఈనాడు, అమరావతి

విజయవాడ నగరానికి మెట్రో ప్రాజెక్టు మళ్లీ తెరమీదకు రావడంతో జాతీయ రహదారుల సంస్థ సమన్వయంతో ప్రాజెక్టు నివేదిక రూపకల్పనకు కసరత్తు జరుగుతోంది. దీనిలో భాగంగా మహానాడు జంక్షన్ నుంచి నిడమానూరు వరకు జాతీయ రహదారుల సంస్థ నిర్మించనున్న సుదీర్ఘ పైవంతెన ఆకృతులు కీలకంగా మారనున్నాయి. ఇందుకు భూసేకరణ అవసరం లేకుండా నిర్మించాలనేది ప్రతిపాదన. అదే మార్గంలో మెట్రో ప్రాజెక్టు నిర్మాణ ప్రతిపాదన ఉండటంతో ముందే ఒక అవగాహనకు రావాలని నిర్ణయించారు. దీనిపై ఏపీ మెట్రో కార్పొరేషన్ అధికారులు, ఇంజినీర్లు, జాతీయ రహదారుల సంస్థ అధికారులు, ఇంజినీర్లు, రాష్ట్ర రహదారుల సంస్థ అధికారులు, ఇంజినీర్లు సోమవారం సమన్వయ భేటీ నిర్వహించి.. సుదీర్ఘ పైవంతన, మెట్రో కారిడార్ నిర్మాణ ఆకృతులపై చర్చించనున్నారు.



భూసేకరణ లేకుండానే..!

మహానాడు జంక్షన్ నుంచి నిడమానూరు వరకు దాదాపు 6.50 కిలోమీటర్ల సుదీర్ఘ పైవంతెన నిర్మాణం భూసేకరణ భారం లేకుండా చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ ప్రతిపాదించింది. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా విజయవాడకు బైపాస్ నిర్మిస్తున్నారు. కాజా నుంచి చిన్నఅవుటపల్లి వరకు ఆరు వరసల బైపాస్ ఉంటుంది. దీని నిర్మాణం పూర్తయ్యాక గన్నవరం నుంచి కాజా వరకు ఉన్న జాతీయ రహదారిని రాష్ట్ర రహదారులు భవనాల శాఖకు (జాతీయ రహదారుల విభాగం) అప్పగించనున్నారు. ఇదే ప్రతిపాదన జాతీయ రహదారుల సంస్థ రోడ్లు రవాణా శాఖ ముందుంచగా.. తమకు అప్పగించే ముందు ట్రాఫిక్ రద్దీ మేరకు మార్పులను సూచించింది. ఈమేరకు రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు వద్ద అండర్ పాస్‌లు లేదా పైవంతెనల నిర్మాణం లేదా సుదీర్ఘ పైవంతెన నిర్మించాలని ప్రతిపాదించారు. విమానాశ్రయానికి వెళ్లే.. వీఐపీ మార్గం కావడంతో అంతరాయం లేని ట్రాఫిక్ నడిచేలా రూపొందించాలని ప్రతిపాదించారు.

మెట్రో కదలికతో..

గత తెదేపా ప్రభుత్వంలో విజయవాడ మెట్రో ప్రాజెక్టు టెండర్ల వరకు వెళ్లింది. తర్వాత ప్రభుత్వం మారడంతో మెట్రో ప్రాజెక్టుకు ఉరేశారు. భూసేకరణనూ గత ప్రభుత్వం ఉపసంహరించింది. తాజాగా కూటమి ప్రభుత్వ రాకతో మెట్రో ఎండీగా ఎన్‌పీ రామకృష్ణారెడ్డిని నియమించారు. విజయవాడలో లైట్ మెట్రోకు మళ్లీ ప్రతిపాదిస్తున్నారు. పీఎన్‌బీఎస్ నుంచి ఒక కారిడార్ ఏలూరు రోడ్డులో, మరో కారిడార్ బందరు రోడ్డులో రానుంది. ప్రస్తుతం సుదీర్ఘ పైవంతెన ఎన్‌హెచ్‌ఏఐ నిర్మించనుంది. మెట్రో లైనుకు ఆటంకం లేకుండా ఆదిలోనే చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించారు.

ఆరు వరసల పైవంతెనకే మొగ్గు...


రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు నగరంలో కలిశాయి. ఇక్కడ రాష్ట్ర కార్యాలయాలూ వెలిశాయి. విమానాశ్రయమూ ఉండడంతో రాకపోకలు ఎక్కువే. ఈమేరకు మహానాడు జంక్షన్ నుంచి నిడమానూరు వరకు 6.5 కిమీ మేర పైవంతెన నిర్మించాలని ప్రతిపాదించారు. అంచనా వ్యయం.. సాధ్యాసాధ్యాలను డీపీఆర్‌లో పొందుపర్చాలి. గత ఆగస్టులోనే డీపీఆర్ టెండర్లను పిలవగా ప్రస్తుతం సవివర ప్రాజెక్టు తయారీలో నిమగ్నమయ్యారు. మహానాడు జంక్షన్ నుంచి రామవరప్పాడు వరకు భూసేకరణకు ఇబ్బంది లేదు. కానీ. అక్కడి నుంచి నిడమానూరు వరకు కనీసం సర్వీసు రోడ్లు లేక జాతీయ రహదారి కుంచించుకుపోయింది. భవనాలు ఎక్కువగా ఉన్నాయి. భూసేకరణ రూ. కోట్లలో ఉంటుంది. దీంతో భూసేకరణ లేకుండా కనకదుర్గ పైవంతెన తరహాలో ఆరు వరసల పైవంతెన నిర్మించాలనేది ప్రతిపాదన.

ఖర్చు మరింత తగ్గే వీలు..

భూసేకరణ లేకుండా నిర్మించే పైవంతెన మీదనే మెట్రో ప్రాజెక్టు పైవంతెన నిర్మించాలనేది ఓ ప్రతిపాదన. పైవంతెనకు నిర్మించే.. పిల్లర్లను రెండు అంతస్తుల వరకు పొడిగించాలని ప్రతిపాదించారు. వీటిని మరింత ఎత్తు పెంచి నిర్మించే బాధ్యత మెట్రో సంస్థదే. ముందే గట్టి పునాదులు వేయాలని నిర్ణయించారు. ఇది ఎంత సాధ్యమనేది చర్చించనున్నారు. ఈ తరహాలో నిర్మిస్తే.. ఖర్చు బాగా తగ్గి.. భూసేకరణ పని ఉండదని చెబుతున్నారు. సమన్వయ సమావేశంలో అన్ని అంశాలు చర్చిస్తామని ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి 'ఈనాడు'తో చెప్పారు.

త్వరలోనే మత్స్యకారులకు వేట నిషేధ భృతి

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తూనే వారి భద్రతకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని, త్వరలోనే వేట నిషేధ భృతి అందిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మెకనైజ్డ్, మోటరైజ్డ్ బోట్లు కలిగిన 50 మంది మత్స్యకారులకు ఆదివారం సాయంత్రం ఆయన సముద్రంలో వేట సాగించే సమయంలో వినియోగించే ట్రాన్స్‌పాండర్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరికరాన్ని పడవలకు అమర్చడం వల్ల అనుకోని పరిస్థితిల్లో బోటు ఆగిపోయినా లేదా దారి తప్పినా గుర్తించేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. బోటు యజమానులతో సమాచారం ఇచ్చిపుచ్చుకోవడానికి, సముద్రంలో మత్స్యసంపద ఉన్న ప్రాంతాన్ని గుర్తించేందుకు సైతం ఉపయోగపడుతుందన్నారు. శాటిలైట్ విధానంలో పనిచేసే ఈ పరికరం విలువ రూ.37 వేల వరకు ఉంటుందని, కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం భరిస్తుందన్నారు. త్వరలోనే మిగిలిన వారికి కూడా ఈ పరికరాలు అందిస్తామన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, దేశానికి అత్యధిక విదేశీ మారకద్రవ్యం అందించే మత్స్యశాఖను గత ప్రభుత్వం



పరికరాలు పంపిణీ చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

నిర్వీర్యం చేసిందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో కామన్ ఫెసిలిటీ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జిల్లా మత్స్య సహకార సంఘ అధ్యక్షుడు కొక్కిలిగడ్డ నాగ రమేష్, మోకా రవి తదితరులు పాల్గొన్నారు.

అడుగు పెట్టనే లేదు.. అతుకులేస్తున్నారు..!



గొల్లపూడి వద్ద పైవంతెనపై సుమారు 8 మీటర్ల పొడవునా రోడ్డు మధ్యలో పగుళ్లు



కె.కంచ్రిక సమీపంలో వంతెన వద్ద చీలిన రోడ్డు



జక్కంపూడి సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి కుంగిపోగా వేసిన అతుకులు

విజయవాడ నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు భారత్‌మాల ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన గొల్లపూడి-చిన్నఆవుటపల్లి ఆరులైన్ల గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో డొల్లతనం బయటపడింది. రూ.1,148 కోట్లతో చేపట్టిన హైవే నిర్మాణ పనులు హైటెన్షన్ తీగల వద్ద మినహా దాదాపు 80 శాతం పూర్తయ్యిందని నిర్మాణ సంస్థ ప్రతినిధులతో కలిసి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు గతంలో వెల్లడించారు. తాజాగా ఆ పనులు పరిశీలిస్తే ఎక్కడ చూసినా పగుళ్లు.. వాటికి అతుకులు అన్నట్లు దర్శనమిస్తుండడం గమనార్హం. ప్రారంభం కాకముందే రోడ్డు పగుళ్లిస్తోంది. నాసిరకం పనులపై ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు పలువురు ఫిర్యాదు చేసినా గత ఐదేళ్లు పట్టించుకోలేదన్న వాదనలు ఉన్నాయి. హైవే నిర్మాణంలో గన్నవరం పరిసరాల్లో మట్టిని అత్యధికంగా వినియోగించడంతో పనుల్లో నాణ్యత లోపించిందని చెబుతున్నారు. రెండు రైల్వే పైవంతెనలు, 17 వాహన అండర్ పాస్‌లు, 36 మైనర్ వంతెనలు, 46 కల్వర్టులతో రూపొందించిన హైవే పనులపై సత్వరమే విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

–ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

అందాల దీవిలో.. లాహిరి లాహిరిలో..

ప్రకృతి రమణీయం మధ్య గుల్లలమోద లైట్‌హౌస్

న్యూస్‌టుడే, నాగాయలంక





మడ అడవుల మధ్య కృష్ణమ్మ అందాలు

కనువిందు చేసే మడ అడవుల అందాలు.. వంపుసొంపులతో పరవళ్లు తొక్కే కృష్ణవేణీ తరంగాలు.. చల్లని చిరుగాలి.. వినసొంపైన పక్షుల కిలకిలారావాలు.. వాటి మధ్య లాహిరిలాహిరిలో అంటూ సాగే పడవ ప్రయాణం.. ఈ మధురానుభూతులు ఆస్వాదించాలంటే నాగాయలంక సముద్ర తీర ప్రాంతంలోని లైట్‌హౌస్‌ను సందర్శించాల్సిందే..

నాగాయలంక మండల పరిధిలోని గుల్లలమోదలోని ఈ ప్రాంతానికి వెళ్లాలంటే కృష్ణా నది పాయల మధ్యలో పడవ ప్రయాణం చేయాలి. గుల్లలమోద నుంచి సముద్ర ప్రాంతం వరకు తెల్ల, నల్ల మడ, పొన్న, దుడ్డు పొన్న తదితర రకాల మొక్కలతో మడ అడవులు ఆకర్షణీయంగా విస్తరించి ఉన్నాయి. మడ అడవులు, నది పాయల మధ్య సాగే ఈ పడవ ప్రయాణం ప్రకృతి ప్రేమికులకు మరుపురాని అనుభూతినిస్తుంది. ఈ ప్రాంతానికి నాగాయలంక, గులల్లమోద, ఎదురుమొండి, సంగమేశ్వరం నంచి ప్రత్యేక పడవల్లో వెళ్లాల్సి ఉంటుంది.

ప్రత్యేక ఆకర్షణగా

రాష్ట్రంలో మరెక్కడా లేనివిధంగా ఓ వైపు కృష్ణా నది పాయలు, ఇంకోవైపు బంగాళాఖాతం మధ్య పచ్చని మడ అడవుల నడుమ నాగాయలంక నుంచి 20 కి.మీ. దూరంలో ఉండే గుల్లలమోద లైట్‌హౌస్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. బ్రిటిష్ కాలంలో నిర్మించిన ఈ లైట్‌హౌస్‌ని 1972లో ఆధునికీకరించారు. 9 అంతస్తులతో గల దీని ఎత్తు 135 అడుగులు. 1977 ఉప్పెనకు 5వ అంతస్తు వరకు వరద నీరు వచ్చినట్లు రికార్డులో నమోదైంది.

రవాణా సదుపాయం కల్పిస్తే పర్యాటకాభివృద్ధి..

ప్రస్తుతం ప్రత్యేక పడవల ద్వారా ఈ లైట్‌హౌస్‌ను సందర్శిస్తున్నారు. ఈ ప్రయాణం కొద్దిగా ఇబ్బందికరంగా ఉండడం, ఖర్చు ఎక్కువ కావడం వల్ల చాలా మంది ఈ ప్రాంతాన్ని సందర్శించలేకపోతున్నారు. దీనికి తోడు మౌలిక వసతులు, ఆహారం అందుబాటులో లేకపోవడంతో పర్యాటకులకు తీవ్ర నిరాశే మిగులుతోంది. పర్యాటకశాఖ ప్రత్యేక పడవలు, లాంచీలు ఏర్పాటు చేస్తే అభివృద్ధి చెందుతుంది. ఈ మేరకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని దివిసీమ ప్రజలు కోరుతున్నారు.



మడ అడవుల సోయగాలు


ప్రభుత్వం చొరవ చూపాలి



అన్ని వనరులూ ఉన్న నాగాయలంక తీరప్రాంతాన్ని దివిసీమ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి. రాజధానికి దగ్గరగా ఉండటంతో పర్యాటకులకు మంచి అనుకూలంగా ఉంటుంది. నాగాయలంక నుంచి లైట్‌హౌస్ వరకు పర్యాటక ప్రాంతంగా ప్రభుత్వం ప్రకటిస్తే మరింత అభివృద్ధి చెందుతుంది.

– తలశిల రఘుశేఖర్, సామాజిక కార్యకర్త, నాగాయలంక

మౌలిక వసతులు కల్పిస్తే మేలు



ప్రభుత్వం చొరవచూపి లైట్‌హౌస్ ప్రాంతానికి ప్రత్యేక పడవలు, బోట్ల సదుపాయం కల్పించాలి. పర్యాటకులకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ప్రభుత్వానికి ఆదాయ వనరుగా ఉపయోగపడటంతో పాటు ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది.

– మెండు లక్ష్మణరావు, తెదేపా నాగాయలంక మండల అధ్యక్షుడు

అన్నపూర్ణాదేవిగా కొండలమ్మ



వేమవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: దేవీశరన్నవరాత్రుల సందర్భంగా వేమవరం కొండలమ్మ దేవస్థానంలో ఆదివారం అమ్మవారు కాశీఅన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సహస్రనామ కుంకుమార్చన, శ్రీసూక్తహవనం, మేధాదక్షిణామూర్తి సుదర్శన హోమం నిర్వహించారు. మధ్యాహ్నం చింతలమడ, మంగళాపురం వారిచే భజన కార్యక్రమాలు, సాయంత్రం ఊంజల్‌సేవ, పంచహారతులు, రాత్రికి రాజమహేంద్రవరం హేమాద్రిబద్రీనాథ్ శిష్యబృందంచే కూచిపూడి నాట్యం, చల్లపల్లి సినీకళాకారుల బృందంచే సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించినట్లు ఈవో ఆకుల కొండలరావు తెలిపారు.

సినీ కళాకారులను అందించిన గడ్డ బందరు

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: సినిమా రంగానికి ఎంతో మంది కళాకారులను అందించిన గడ్డ బందరు అని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం నోబుల్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం 'జనక అయితే గనక' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హీరో సుహాస్ విజయవాడకు చెందిన వ్యక్తి కావడం అభినందనీయమన్నారు. త్వరలో వచ్చే 'గేమ్ ఛేంజర్' లాంటి సినిమాల వేడుకలను కూడా మచిలీపట్నంలో నిర్వహించాలని నిర్మాత దిల్ రాజును కోరుతున్నామన్నారు. బందరు బీచ్‌ను అభివృద్ధి చేసుకుంటే ఇలాంటి వేడుకలు మరిన్ని జరుపుకోవచ్చన్నారు. చిత్ర బృందానికి అభినందనలు తెలియజేశారు. సినిమా నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ చారిత్రక మచిలీపట్నంలో ఈ వేడుక నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. హీరో సుహాస్ మాట్లాడుతూ అక్టోబర్ 12న సినిమా వస్తుందని, ఆద్యంతం నవ్విస్తుందన్నారు. బందరుతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. హీరోయిన్ సంగీర్తన ఏపీఎస్‌ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, దర్శకుడు సందీప్, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు తదితరులు ప్రసంగించారు. తొలుత మచిలీపట్నం ప్రత్యేకమైన శక్తిపటాలకు వేదికపై పూజలు చేశారు. యువత, సినీ అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు.



హీరో, హీరోయిన్, దిల్‌రాజుతో మంత్రి రవీంద్ర

టెట్ పరీక్షలకు 85.54 శాతం హాజరు

మచిలీపట్నం(గొడుగుపేట),న్యూస్‌టుడే: జిల్లాలోని వివిధ కేంద్రాల్లో నిర్వహిస్తున్న టెట్ పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయి. ఆదివారం ఉదయం పూట 3 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా 1330 మందికి గానూ 1136 మంది హాజరయ్యారు. 194 మంది గైర్హాజరైనట్లు డీఈవో తాహెరాసుల్తానా ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రెండు కేంద్రాల్లో పరీక్షలు జరగగా 370మందికి గానూ 317 మంది హజరయ్యారని, 53మంది గైర్హాజరయ్యారని అన్నారు. మొత్తం 85.54 శాతం హాజరు నమోదైందని పేర్కొన్నారు.

8న జిల్లా బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నూజివీడులోని డీఏఆర్ కళాశాల మైదానంలో ఈ నెల 8వ తేదీ సాయంత్రం 3 గంటలకు ఉమ్మడి కృష్ణా జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని ఉమ్మడి కృష్ణా జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. జనవరి ఒకటి, 2011 తర్వాత జన్మించిన వారై జిల్లా బాస్కెట్‌బాల్ సంఘానికి అనుబంధంగా ఉన్న క్లబ్బులకు చెందిన క్రీడాకారులు మాత్రమే ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఆధార్‌కార్డు, పుట్టినతేదీ ఒరిజనల్ ధ్రువపత్రాలతో ఎంపిక పోటీలకు హాజరవ్వాలన్నారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 10 నుంచి మూడు రోజుల పాటు తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలో జరిగే 7వ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన తెలిపారు.

కవిరాజ కళా మందిరానికి పూర్వ వైభవం

ఆక్రమణలు తొలగించాలని చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌లకు హనుమాన్ చౌదరి లేఖలు

న్యూస్‌టుడే, గుడివాడ పట్టణం



కవిరాజు కళామందిరం

గుడివాడలోని చారిత్రక త్రిపురనేని రామస్వామి చౌదరి స్మారక భవనాన్ని ఆక్రమణల చెర నుంచి పరిరక్షించి కళానిలయంగా అభివృద్ధి చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌కు ప్రజ్ఞా భారతి ఛైర్మన్ పద్మశ్రీ త్రిపురనేని హనుమాన్ చౌదరి లేఖలు రాశారు. పట్టణంలోని కవిరాజ కళామందిరాన్ని ఓ లక్ష్యంతో కవిరాజ సాహిత్య విహారం వారు నిర్మించగా అప్పట్లో అందులో కళలు, సాహిత్యానికి పెద్ద పీట వేశారన్నారు. కాలక్రమేణా కవిరాజ కళామందిరం ఆక్రమణలకు గురై ప్రైవేటు వ్యక్తులకు ఆదాయ వనరుగా మారి కళావిహీనంగా తయారైందన్నారు. పూర్వ వైభవం సొంతం చేసుకునేలా అభివృద్ధి చేయాలని లేఖల్లో పేర్కొన్నారు. ఈ మేరకు పురపాలక సంఘం లేదా కవిరాజు సాహిత్య విహారం ఆధ్వర్యంలో కృషి చేయాలని కోరారు. తొలుత ఆక్రమణల చెర నుంచి కళామందిరం రక్షణకు ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకోవాలన్నారు. గత ఎన్నికల ముందు నుంచే పురపాలక సంఘం దీన్ని స్వాధీనం చేసుకున్నారు. కానీ నేటివరకూ ఆక్రమణలు తొలగించని కారణంగా ఎలాంటి అభివృద్ధి పనులు ప్రారంభం కాకపోవడంతో త్రిపురనేని హనుమాన్ చౌదరి ప్రభుత్వానికి, మంత్రులకు లేఖలు రాశారు.

దరఖాస్తుల స్వీకరణకు ఆలస్య రుసుము చెల్లించక్కర్లేదు

వెనక్కి తగ్గిన ఎన్టీఆర్ వర్సిటీ

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: పీజీ వైద్య విద్యలో ప్రవేశాల కోసం... ఆలస్య రుసుముతో కాకుండా.. సాధారణ విధానంలోనే సోమవారం వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వెల్లడించింది. రూ.10 వేల ఫీజుతో ఆలస్యంగా దరఖాస్తులు స్వీకరించడంపై మీడియాలో వచ్చిన వార్తలపై విశ్వవిద్యాలయం ఆదివారం స్పందించింది. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ఆలస్య ఫీజుతో 16 మంది మాత్రమే దరఖాస్తు చేశారని తెలిపింది. వీటినీ సాధారణ విధానంలో దరఖాస్తు చేసినట్లు గుర్తిస్తామని వెల్లడించింది. సకాలంలో మెరిట్ లిస్టు తయారీకి మాత్రమే ఆలస్య రుసుము విధానాన్ని అమల్లోనికి తెచ్చామని పేర్కొంది. జాతీయ స్థాయిలో ఎన్ఎంసీ ప్రకటించే షెడ్యూలుకు అనుగుణంగా ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపింది. గతంలో మాదిరిగానే కౌన్సెలింగ్ ప్రారంభానికి ముందు సీట్ మ్యాట్రిక్స్‌ను ప్రకటించి, వైద్య విద్యార్థుల నుంచి ఆప్షన్లు కోరుతామని వెల్లడించింది.

డిసెంబరు 22న చలో విజయవాడ

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ, క్రీమీలేయర్‌కు వ్యతిరేకంగా డిసెంబర్ 22న వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమితి రాష్ట్ర అధ్యక్షుడు పంతగాని రమేష్ కోరారు. స్థానిక ఎన్జీవో హోమ్‌లో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణను ప్రజాపోరాటాల ద్వారా ఎదుర్కొంటామన్నారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన రిజర్వేషన్‌ను వర్గీకరిస్తే సహించబోమన్నారు. మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దార్ల సురేష్, మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి రావూరి రాజు, సంఘ జిల్లా నాయకులు జి.రాజేంద్ర, బల్లి డేవిడ్‌రాజు, భూపతి రవీంద్ర, స్వామిదాసు, వేముల దయారత్నం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మాలమహానాడు నాయకులు

ఏకలవ్య ఫెడరేషన్ నూతన కమిటీ ఎన్నిక

గాంధీనగర్, న్యూస్‌టుడే : ఏకలవ్య గ్లోబల్ ఫెడరేషన్ నూతన కమిటీని ఆదివారం ప్రెస్ క్లబ్‌లో ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కండెల ఆంజనేయరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మేడ రమేష్, ఉపాధ్యక్షుడిగా మొగలి అద్దయ్య, ప్రధాన కార్యదర్శిగా జగన్నాథ బాబూరావు, సహాయ కార్యదర్శిగా దేవర వెంకటేశ్వర్లు, కోశాధికారిగా భారతి ఎన్నికయ్యారు. అలాగే కృష్ణా జిల్లా అధ్యక్షుడిగా కె.నాగవెంకన్న, గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా కుంభ ఏడుకొండలు నియమితులయ్యారు.

ఇంజిన్ ఆయిల్ మార్చమని ఇస్తే కారు అమ్మేశారు

నలుగురిపై కేసు

పెనమలూరు, న్యూస్‌టుడే: ఆయిల్ మార్చమని ఇచ్చిన కారును అమ్మేసిన వ్యక్తులపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. ప్రకారం.. సిద్ధాబత్తుల పవన్‌కుమార్ తాడిగడప నివాసి. ఇతను ఆంధ్ర ఆసుపత్రిలోని శస్త్రచికిత్సల విభాగంలో పనిచేస్తుంటారు. ఇతనికి హోండా అమేజ్ కారు ఉంది. దీనికి ఇంజిన్ ఆయిల్ మార్చి బ్రేకులు సరిచేయమని తాడగడపలోని అబ్దుల్ అజీమ్ అనే మెకానిక్‌కు కొద్దిరోజుల కిందట ఇచ్చారు. రెండు రోజుల తర్వాత పవన్‌కుమార్ తన కారు కోసం వెళ్లగా రేపు, ఎల్లుండి అంటూ మెకానిక్ తిప్పించడం మొదలు పెట్టాడు. అనుమానం వచ్చిన పవన్‌కుమార్ వారం కిందట మరోసారి అజీమ్ వద్దకు వెళ్లి కారును చూపించమని అడగ్గా.. రమేష్ అనే వేరే మెకానిక్‌కు ఇచ్చానంటూ తెలిపాడు. దీంతో కారు యజమాని రమేష్ వద్దకు వెళ్లి ప్రశ్నించగా అనంతపురం జిల్లా తాడిపత్రిలోని గంగాధర్‌రెడ్డి అనే బ్రోకర్ ద్వారా అదే ప్రాంతంలో ఉండే బ్రహ్మానందరెడ్డికి అమ్మేసినట్లు తెలుపడంతో అసలు యజమాని పవన్‌కుమార్ అవాక్కయ్యారు. దీనిపై పవన్‌కుమార్.. బ్రహ్మానందరెడ్డిని ప్రశ్నించగా తక్కువ ధరకు వచ్చింది కాబట్టి కొన్నానంటూ నిర్లక్ష్యంగా చెప్పాడు. పదేపదే కారు గురించి అడిగితే చంపేస్తానంటూ బెదిరించాడు. బాధితుడు పవన్‌కుమార్ ఫిర్యాదు మేరకు మెకానిక్‌లు అబ్దుల్ అజీమ్, రమేష్, బ్రహ్మానందరెడ్డి, గంగాధరరెడ్డిలపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమపేరుతో బాలిక ఇంటికెళ్లిన యువకుడు

తాళి కట్టించిన బంధువులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రేమ పేరుతో అర్ధరాత్రి బాలిక(17) ఇంటికెళ్లిన యువకుడితో తాళి కట్టించిన ఘటన కృష్ణా జిల్లా గన్నవరం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఓ బాలికకు తల్లి లేకపోవడంతో మేనత్త వద్ద ఉంటోంది. సూరంపల్లి గ్రామానికి చెందిన గుర్రం శ్రీకాంత్ అనే యువకుడు కొంతకాలంగా ప్రేమ పేరుతో బాలిక ఇంటికి తరచూ రావడాన్ని చుట్టుపక్కల వారు గమనిస్తున్నారు. శనివారం రాత్రి బాలిక ఇంటికి వచ్చిన యువకుడిని బంధువులు అదుపులోకి తీసుకొని తాళ్లతో బంధించారు. అనంతరం బాలికను పెళ్లి చేసుకోవాలని పట్టుబట్టారు. వేర్వేరు కులాలు కావడంతో యువకుడి తల్లిదండ్రులు నిరాకరించారు. తాళి కట్టాల్సిందేనని పెద్దల సమక్షంలో యువకుడితో బాలికకు తాళి కట్టించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఇరువర్గాలను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం విజయవాడ కృష్ణలంకకు చెందిన ఐసీడీఎస్ ఉజ్వల హోమ్ ప్రతినిధులు సీఐ శివప్రసాద్ నుంచి పూర్తి వివరాలు సేకరించారు. బాలికను హోమ్‌కు తరలించారు. దీనిపై ప్రస్తుతానికి స్టేషన్‌లో ఎలాంటి కేసు నమోదు కాలేదు.

12వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి

మచిలీపట్నం(గొడుగుపేట): ఇటీవల వరద ముంపు ప్రభావిత ప్రాంతాలతోపాటు వర్షాల కారణంగా విద్యార్హత ధ్రువపత్రాలు తడిసి పాడైపోయిన వారు డూప్లికేట్ ధ్రువపత్రాలు పొందేందుకు ఈ నెల 12వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో తాహెరాసుల్తానా ఒక ప్రకటనలో తెలిపారు. ధ్రువపత్రాలు పొందే అభ్యర్థులు తమ సొంత డిక్లరేషన్‌తో ఆధార్‌కార్డు, కావాల్సిన ధ్రువపత్రాల నకలుతో నిర్దేశించిన సమయంలోపు మచిలీపట్నంలోని డీఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి, ఒకేషనల్, డి.ఇల్.ఇడి, టీటీసీ, టీసీసీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

'పీఎం యశస్వి' ఉపకార వేతనానికి దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నం(గొడుగుపేట): కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 'పీఎం యశస్వి' పథకం ద్వారా 2024-25 విద్యాసంవత్సరానికి ఉపకార వేతనాలు అందించేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి జి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 9, 10, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదివే బీసీ, ఈబీసీ, సంచార జాతులకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం 2.50 లక్షల లోపు ఉండాలని, సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

పరిహారం ఇవ్వకుండా పనులెలా చేస్తారు?

నున్న(రామవరప్పాడు), న్యూస్‌టుడే : పశ్చిమ బైపాస్ విస్తరణలో భాగంగా నున్న బైపాస్ సమీపంలో హైటెన్షన్ టవర్లు వేస్తుండగా రైతులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత ఏర్పడింది. ఎలాంటి సమాచారం లేకుండా.. నోటీసులు ఇవ్వకుండా తమ పొలాల్లో టవర్లు ఎలా వేస్తారని ఆదివారం గుత్తేదారుడిని నిలదీశారు. కోర్టు నిబంధనల ప్రకారం.. ఏదైనా ప్రైవేటు భూములు, స్థలాల్లో నిర్మాణాలు చేపడితే సంబంధిత యజమానులకు ముందుగా నోటీసులు ఇవ్వాల్సి ఉందని చెప్పారు. కానీ గుత్తేదారు పట్టించుకోకుండా ఇష్టానుసారం తమ పొలాల్లో టవర్లు ఏర్పాటు చేస్తున్నారని రైతులు, కుటుంబ సభ్యులు మండిపడ్డారు. పెద్ద ఎత్తున గొడవ జరగడంతో పోలీసులు చేరుకొని ఇరువర్గాలకు నచ్చజెప్పారు. కలెక్టర్ అనుమతి లేకుండా, తమకు నష్టపరిహారం చెల్లించకుండా ఏ విధంగా తమ పొలాల్లో టవర్లు నిర్మిస్తారని ధ్వజమెత్తారు. సోమవారం గాంధీనగర్‌లో తహసీల్దార్‌ను కలుస్తామని చెప్పారు. అవసరమైతే ధర్నాకు దిగుతామని రైతులు హెచ్చరించారు. ఆన్‌లైన్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌కు ఫిర్యాదు చేసినట్లు వారు వివరించారు.



విద్యుత్తు అధికారులతో మాట్లాడుతున్న రైతులు

అశ్రునయనాల మధ్య దివ్య అంత్యక్రియలు

అమెరికాలో గుండెపోటుతో మృతి

నున్న (రామవరప్పాడు), న్యూస్‌టుడే : విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామానికి చెందిన అవుతు దివ్య(22) అమెరికాలోని అట్లాంటాలో గుండెపోటుతో గత నెల 30న మరణించింది. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సహకారంతో ఆమె మృతదేహాన్ని శనివారం నున్న తీసుకొచ్చారు. మృతదేహాన్ని చూసేందుకు గ్రామస్థులు, స్నేహితులు, బంధువులు భారీగా తరలివచ్చారు. యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు యార్లగడ్డ సతీష్ ఆదివారం దివ్య మృతదేహానికి నివాళులర్పించి, ఆమె తండ్రి సురేంద్రరెడ్డికి ధైర్యం చెప్పారు. అంతిమయాత్రలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆమె అంత్యక్రియలు నిర్వహించారు.



దివ్య భౌతికకాయంతో నున్నలో అంతిమ యాత్ర

నాలుగు కేజీల గంజాయి స్వాధీనం : ఏడుగురి అరెస్టు

పెదకాకాని, న్యూస్‌టుడే: యువతకు గంజాయి రవాణా చేస్తున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని నంబూరుకు చెందిన ప్రైవేటు ఉద్యోగి వాసా రాజేష్, ట్రాక్టర్ డ్రైవర్ తాడిబోయిన గోపికృష్ణ, కూల్‌డ్రింక్ దుకాణం నిర్వాహకుడు దుర్గపు పవన్‌కుమార్ స్నేహితులు. ఈ ముగ్గురు జల్సాలకు అలవాటు పడి గంజాయి తెప్పించి విక్రయిస్తున్నారు. వీరికి గంజాయి వ్యాపారం చేసే అనగాని రాఘవేంద్ర (కృష్ణా జిల్లా ఉయ్యూరు), తాతా హేమంత్ (ఏలూరు జిల్లా నూజివీడు), విజయవాడ పడమటకు చెందిన పండాలనేని వెంకట శివ గణేశ్‌కుమార్, ప్రతివాడ శివాజీ తోడయ్యారు. ఈ నెల 5వ తేదీ రాత్రి ఈ నలుగురు గంజాయి తీసుకొచ్చి నంబూరులోని ఓ కాలనీ వద్ద ఉన్న రాజేష్, గోపికృష్ణ, పవన్‌కుమార్‌లకు ఇచ్చారు. అందరూ కలిసి గంజాయిని చిన్న పొట్లాలుగా ప్యాకింగ్ చేస్తున్నారు. అదే సమయంలో పెదకాకాని సీఐ నారాయణస్వామి, కానిస్టేబుళ్లు దాడి చేసి ఈ ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నాలుగు కేజీల గంజాయి (విలువ రూ.60వేలు), మూడు ద్విచక్ర వాహనాలు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్ కృష్ణకాంత్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి నిందితులను ఆదివారం రిమాండ్‌కి పంపినట్లు సీఐ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.86/-.

అక్రమంగా తరలిస్తున్న 50 గోవుల స్వాధీనం



నెమలి వేణుగోపాలస్వామి ఆలయ కోనేరు వద్ద సేద తీరుతున్న ఆవులు

గంపలగూడెం, న్యూస్‌టుడే: కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గంలోని హనుమాన్‌జంక్షన్ నుంచి హైదరాబాదుకు లారీలో అక్రమంగా తరలిస్తున్న 50 గోవులను ఎన్టీఆర్‌జిల్లా తిరువూరు నియోజకవర్గం గంపలగూడెం పోలీసులు శనివారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ఎస్.శ్రీను తెలిపిన వివరాల మేరకు మండలంలోని పెనుగొలను వద్ద అర్ధరాత్రి తనిఖీలు నిర్వహిస్తుండగా లారీలో ఆవులను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే లారీని స్వాధీనం చేసుకొని ఆవులను నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలోని గోశాలలో ఉంచామని పేర్కొన్నారు. తెలంగాణలోని సూర్యాపేట జిల్లా ఆత్మకూరు మండలం నర్సింగ్ తండాకు చెందిన డ్రైవర్ బాణావత్ రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

ఆలయ ఆదాయం రూ.7.22 లక్షలు

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవి శ్రీవల్లీ దేవసేనాసమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. దాదాపు 10వేల మంది స్వామికి మొక్కులు సమర్పించి పాలపొంగళ్లు నివేదించి పూజల్లో పాల్గొన్నారు. ఆదివారం రూ7.22లక్షల ఆదాయం సమకూరినట్లు డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామవరప్రసాద్ తెలిపారు.


బారులు తీరిన భక్తులు

8న జాబ్ మేళా

అవనిగడ్డ: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), జిల్లా ఉపాధి కల్పనా శాఖ, డీఆర్‌డీఏ, సీ.డాప్‌ల ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఈనెల 8న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పి.నరేష్‌కుమార్, జిల్లా ఉపాధి కల్పనాధికారి విక్టర్‌బాబు తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తిచేసి 18 ఏళ్ల నుంచి 29 ఏళ్ల లోపు వారు అర్హులని చెప్పారు. ఎంపికైన వారికి నెలకు రూ. 10 వేలు నుంచి రూ.18 వేలు వరకు వేతనం ఉంటుందన్నారు.

సినిమాలు

రేవతి – సత్యం సుందరం
మినీరేవతి – రామ్‌నగర్ బన్నీ
సిరివెంకట్ – దేవర
రామరాజు– స్వాగ్

- మచిలీపట్నం కార్పొరేషన్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687



? తుమ్మలపాలెం నుంచి పొలాల మీదుగా చిన్నాపురం-తుమ్మలచెరువును రహదారిని కలిపే సీసీ రోడ్డు పగుళ్లు ఇచ్చింది. **- వెంకటేశ్వరరావు, తుమ్మలపాలెం**

✔ ఉపాధి పథకంలో నిధులు మంజూరు చేయించి పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

-సతీష్, పంచాయతీ కార్యదర్శి, ఎన్.గొల్లపాలెం

-మచిలీపట్నంరూరల్, న్యూస్‌టుడే

'వడ్డెరలను ఎస్టీల్లో చేర్చాలి'

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: వడ్డెర సామాజిక వర్గాన్ని ఎస్టీల్లో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘం జిల్లా నాయకుడు చంద్రగిరి శివనాగమల్లేశ్వరరావు కోరారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం వడ్డెర సంఘం నాయకుడు వడ్డే ఓబన్న వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పించి వడ్డెర హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని నినాదాలు చేశారు. వడ్డెర వృత్తిదారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఓర్సు రాములు, బత్తుల నాగరాజు, సహాయ కార్యదర్శి తమ్మిశెట్టి నాగ పాల్గొన్నారు.

బీచ్‌లో పర్యాటకులకు జాగ్రత్తలు

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: పాలకాయతిప్ప బీచ్ వద్ద స్నానాలు చేయడానికి వచ్చిన యాత్రికులు తప్పకుండా జాగ్రత్తలు పాటించాలని మెరైన్ సీఐ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సందర్శకులకు సూచనలు చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే బీచ్‌కు అనుమతిస్తామన్నారు. అధికంగా గుంతలు ఉన్న కారణంగా సాగరసంగమ ప్రదేశానికి అనుమతి లేదని చెప్పారు. సముద్రంలో సుడిగుండాలున్న కారణంగా 12 అడుగులకు మించి లోపలకు వెళ్లరాదన్నారు. చిన్న పిల్లలను ఒంటరిగా బీచ్ వద్ద వదలరాదని చెప్పారు.

అక్కరకు వచ్చేనా.. అవస్థలు తీరేనా..!

ఏళ్ల నాడు అర్ధాంతరంగా ఆగిపోయిన భవనాలు వైకాపా పాలకులు నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయి. బందరు మండలంలోని పలు గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో రూ.లక్షల ప్రజాధనం వెచ్చించిన నిర్మాణాలు అసంపూర్తిగా వెక్కిరిస్తున్నాయి.

- న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)

ఏళ్లుగా పూర్తికాని ప్రభుత్వ భవన నిర్మాణాలు

పునాది దశ దాటితే ఒట్టు..



బందరు మండలం బొర్రపోతుపాలెం గ్రామంలో పంచాయతీ భవనం నిర్మాణానికి 2018లో శంకుస్థాపన చేయడంతోపాటు పనులు కూడా ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.15 లక్షలు వెచ్చించి పనులు చేపట్టగా కొంతవరకు పనులు కూడా చేశారు. ఆ తరువాత వైకాపా ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు ఆ భవనాన్ని అసంపూర్తిగా వదిలేయడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

దశాబ్దాలుగా ఇంతే..

పెదకరగ్రహారంలో పంచాయతీ భవనం లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఓ దాత తనవంతు రూ.10 లక్షలు ఇచ్చేందుకు ముందుకు రావడంతో వాటికి కొంత ప్రభుత్వ నిధులు జతచేసి భవనం నిర్మించేందుకు అప్పటి పాలకులు నిర్ణయించారు. 2005లో పనులు ప్రారంభించినట్లు స్థానికులు చెబుతున్నారు. రూ.లక్షలు వెచ్చించి రెండు అంతస్తుల వరకూ బలమైన పిల్లర్లతో స్లాబు పనులు పూర్తి చేశారు. అప్పటి నుంచి నేటి వరకూ మిగిలిన పనులు పూర్తి చేసే దిశగా ఎవ్వరూ చొరవ తీసుకోలేదు. పాలక వర్గాలు మారినా పరిస్థితిలో ఎలాంటి మార్పురాలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిపాటి వ్యయంతో అందుబాటులోకి వచ్చే భవనాన్ని వదిలేసి.. దానికి సమీపంలోనే రూ.లక్షల ప్రజాధనంతో నూతన సచివాలయ భవనాన్ని నిర్మించడంపై గ్రామస్థుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.





పశువులకు అడ్డా..

బందరు మండలంలోని 34 పంచాయతీల్లో కలిపి 97 కేంద్రాలు ఉంటే 30కిపైగా కేంద్రాలు అద్దె గదుల్లోనే కొనసాగుతున్నాయి. వీటికి సొంత భవనాల నిర్మాణానికి తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు చేసినా, తరువాత ప్రభుత్వం మారడంతో అవి అమలుకు నోచుకోలేదు. సుల్తానగరంలో కేంద్రానికి భవన నిర్మాణ పనులు ప్రారంభించడంతోపాటు సగం మేర పనులు చేసి అసంపూర్తిగా వదిలేశారు. నిధులు విడుదల కాకపోవడంతో గుత్తేదారు వాటిని సగంలోనే వదిలేశారు. ప్రస్తుతం నిర్మాణం చుట్టూ పొదలు వ్యాపించి అధ్వానంగా తయారైంది. స్థానికులు కొందరు అక్కడ పశువులను కట్టి మేపుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా ఆయా భవనాలు అందుబాటులోకి వస్తాయని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. తల్లి దుర్మరణం

తండ్రీ కుమార్తెల పరిస్థితి విషమం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో తల్లి మృతి చెందగా, తండ్రి, మరో కుమార్తె పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల కథనం ప్రకారం.. ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం వణుదుర్రుకు చెందిన మైనాకు విజయవాడకు చెందిన కిరణ్‌తో ఆర్నెల్ల కిందట వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు. విజయవాడ నుంచి భర్త, కుమార్తెలతో మైనా వణుదుర్రులోని పుట్టింటికి రెండ్రోజుల కిందట వచ్చింది. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో తిరిగి ద్విచక్ర వాహనంపై విజయవాడకు బయలుదేరారు. సింగరాయపాలెం పెట్రోలు బంక్ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం వీరి వాహనాన్ని బలంగా ఢీకొంది. ప్రమాదంలో మైనా(25) అక్కడికక్కడే మృతి చెందగా, భర్త కిరణ్, ఆయుషే పెద్ద కుమార్తె, మరో ద్విచక్రవాహనంపై ఉన్న యువకుని 108లో గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మటనా స్థలిలో ఉన్న చిన్న కుమార్తె పరిస్థితి విషమంగా ఉండటంతో ఎస్సై వెంకటకుమార్, సిబ్బంది వారి వాహనంలో ముదినేపల్లిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి గుడివాడ తరలించడానికి 108 కోసం ఎంత ప్రయత్నించినా అవి అందుబాటులోకి రాలేదు. చివరికి సింగరాయపాలెంలోని ఓ పరిశ్రమకు చెందిన అంబులెన్స్‌లో గుడివాడ ఆసుపత్రికి తరలించారు. మరో ద్విచక్ర వాహనంపై ఇద్దరు యువకులు ఉన్నట్లు సమాచారం. బంటుమిల్లి మండలం మల్లపరాజుగూడెనికి చెందిన వారుగా స్థానికులు భావిస్తున్నారు.


ప్రమాదంలో ధ్వంసమైన బైకులు


ముదినేపల్లి ఆసుపత్రిలో చిన్నారి

ఖాళీ స్థలాలు.. రోగాలకు ఆవాసాలు

మచిలీపట్నంకార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలో చాలా మంది స్థలాలను ఖాళీగా వదిలేస్తున్నారు. వాటిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో అవన్నీ మురుగునీరు, ముళ్లపొదలతో నిండిపోతున్నాయి. వాటి నుంచి వచ్చే దుర్వాసన, దోమలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా ప్రాంతాల్లో అనేక మంది స్థలాలు కొనుగోలు చేసి ఖాళీగా వదిలేశారు. వలందపాలెం, మాచవరం, పరాసుపేట, బాస్కరపురం, బ్రహ్మపురం, ఈడేపల్లి, ఆర్టీసీకాలనీ, గొడుగుపేట, రాజుపేట ఇలా పలు ప్రాంతాల్లో ఉన్న ఖాళీ స్థలాల్లో మురుగునీరు చేరి చెరువులు ఏర్పడుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో మురుగుతోపాటు గుర్రపుడెక్క, తూడుతో అల్లుకుపోవడంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వాటి నుంచి వస్తున్న వాసనతోపాటు రాత్రయితే చాలు దోమల దాడితో నరకయాతన అనుభవిస్తున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


మాచవరం మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద తూడు


వలందపాలెం మసీదు వద్ద..

క్వాలిఫైయింగ్ ఫైనల్ రౌండ్‌కు రాష్ట్ర షట్లర్లు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలోని సీహెచ్ఆర్‌కే వీఎంసీ ఇండోర్ స్టేడియం, ఎస్ఏస్‌ఏస్ ఇండోర్ స్టేడియాల్లో జరుగుతున్న ఆలిండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీలో పలువురు రాష్ట్ర షట్లర్లు క్వాలి ఫైయింగ్ ఫైనల్ రౌండ్‌లో ప్రవేశించారు. ఆదివారం జరిగిన పోటీల్లో పలువురు రాష్ట్ర షట్లర్లు హోరా.. హోరీగా తలపడి తమ సత్తా నిరూపించారు. అండర్-15 బాలుర సింగిల్స్‌లో ఎ.పవన్ అంగడ్ రాజ్, ఎస్. హేమంత్‌శ్రీ, వినాయక మణిబాబు, ఎం.కృష్ణ కార్తీక్, సీహెచ్ విజయ్ చరణ్, కె.మోక్షజ్ఞ సాయి, బాలికల సింగిల్స్‌లో ఐ.తన్వి, ఆర్.లక్ష్మీసాయి ఆరాధ్య, డి.వెంకట్ యజ్ఞశ్రీ, డి.ధన్య సంజన, ఎస్. మనస్విని, అండర్-17 బాలుర సింగిల్స్‌లో డి.శేఖరశతమన్యు(కృష్ణా), హరికృష్ణ వీరంరెడ్డి, బాలికల సింగిల్స్‌లో ఆర్. లక్ష్మీసాయి ఆరాధ్య(గుంటూరు), ఆర్.స్ఫూర్తిలు ఫైనల్ రౌండ్‌లో ప్రవేశించారు. సోమవారం క్వాలి ఫైయింగ్ ఫైనల్ రౌండ్ పోటీలు జరుగుతాయని రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి పోలినేని అంకమ్మచౌదరి తెలిపారు.


శేఖర్ శతమన్యు


లక్ష్మీసాయి ఆరాధ్య


పెడన: పైడమ్మ వారి ఆలయంలో లలిత త్రిపుర సుందరి దేవిగా..


పెడన: కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ..


చిట్టిపాలెంలో..


ఎన్.ఎన్.గొల్లపాలెంలో మహాలక్ష్మిగా..



పెదతుమ్మిడి రామాలయంలో..


బంటుమిల్లి కనకదుర్గమ్మ ఆలయంలో..

అమ్మ దర్శనం.. సకల శుభకరం

మచిలీపట్నం(గొడుగుపేట), గూడూరు, న్యూస్‌టుడే: బందరు నగరంలోని పలు ఆలయాలతోపాటు వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన ఉత్సవ మండపాల్లో దసరా ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం అమ్మవార్లను ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. గూడూరు మండలంలోని పోలవరం, తరకటూరు, కప్పలదొడ్డి, ఐదుగుల్లపల్లి, మల్లవోలు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులతో కిటకిటలాడాయి.

పెడన, బంటుమిల్లి, మచిలీపట్నం రూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు లలితా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక గూడూరు రోడ్డులోని శ్రీకన్యకా పరమేశ్వరీ ఆలయంలో సామూహిక కుంకుమార్చనలు చేశారు. గ్రామదేవత పైడమ్మ వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు.


మచిలీపట్నం: ధాన్యలక్ష్మీదేవిగా కన్యకాపరమేశ్వరి


బందరు దత్తాశ్రమంలో వారాహి అమ్మవారు


త్రిశక్తిపీఠంలో..


మచిలీపట్నం: ఖొజ్జిల్లిపేట ముత్యాలమ్మవారు..


గూడూరు: గాంధీబొమ్మసెంటరులో లలితాత్రిపుర సుందరి


గూడూరు: ఐదుగుళ్లపల్లిలో లలితాదేవి

ఎస్ఎస్ఏ ఉద్యోగులకు వేతనాలివ్వండి

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: సమగ్ర శిక్ష (ఎస్ఎస్ఏ) ఉద్యోగుల వేతనాలు త్వరితగతిన విడుదల చేయాలని ఆర్ట్, వర్క్, హెల్త్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పార్ట్‌టైమ్ కాంట్రాక్ట్ ఇన్‌స్ట్రక్టర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ఎన్ దేవేంద్రరావు కోరారు. ఆదివారం మంత్రి కొల్లు రవీంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆగస్టు, సెప్టెంబరు నెలల వేతనాలు ఇంతవరకు చెల్లించకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులను అడిగితే ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయాల్సి ఉందని, ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు అందించేలా చూడాలని కోరారు. విషయాన్ని ముఖ్యమంత్రి, విద్యాశాఖామంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారని అన్నారు.

తెదేపా నేత గోఖలే మృతి

గూడూరు, న్యూస్‌టుడే: గోఖలే మృతి తెదేపాకు తీరని లోటని మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. గూడూరు మాజీ జడ్పీటీసీ సభ్యుడు, ఆ పార్టీ సీనియర్ నాయకుడు చిలుకోటి గోపాలకృష్ణగోఖలే (80) ఆదివారం అనారోగ్య కారణాలతో ఇంటి వద్ద మృతి చెందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోపాటు పలువురు నాయకులు చిట్టిగూడూరులోని ఆయన ఇంటికి వెళ్లి నివాళులర్పించారు. పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా వ్యవహరిస్తూ గోఖలే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. గతంలో విజయవాడ కనకదుర్గ ఆలయ బోర్డు సభ్యుడిగా, టెలికం ఎడ్వయిజరీ బోర్డు సభ్యుడిగా పనిచేశారు. తెదేపా నాయకులు కొనకళ్ల బుల్లయ్య, గోపి నాగబాబు, చింతగుంట కృష్ణ, బేతాళ స్వామి, గుంటూరు వెంకటరత్నం, రాసంశెట్టి శివరావు తదితరులు నివాళులు అర్పించిన నియోజకవర్గంలో వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు సంతాపం తెలియజేశారు.


గోపాలకృష్ణగోఖలే (పాత చిత్రం)

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: ఆరోగ్యం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు వైద్యులు తెలిపారు. ఆదివారం నగరంలోని జ్యోతిబాపులె విజ్ఞాన కేంద్రంలో జీబీఆర్ ఫౌండేషన్, ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో న్యూరాలజిస్ట్ డా.గోపాలం శ్రీమన్నారాయణ నేతృత్వంలో పెనుబోతు వెంకటేశ్వరరావు స్మారక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో పాల్గొన్న రోగులకు వివిధ విభాగాల వైద్యులు డీఆర్‌కే ప్రసాదు, పి. సురేష్‌చంద్రారెడ్డి, కుప్పా రామశాస్త్రి, శంకరానందలు పాల్గొని వైద్యపరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 250 మంది రోగులు పాల్గొన్నట్లు నిర్వాహక సభ్యులు పామర్తి నాగయ్య తెలిపారు.


రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

వైద్య వృత్తిలో ప్రతిభ అభినందనీయం

భాస్కరపురం(మచిలీపట్నం), న్యూస్‌టుడే: మచిలీపట్నానికి చెందిన వేము సందీప్ వైద్యవృత్తిలో ప్రతిభ చాటి బంగారు పతకం సాధించడం అభినందనీయని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. క్లిష్టమైన కంటి శస్త్రచికిత్సలు నిర్వహించినందుకుగాను ఇటీవల భీమవరంలో జరిగిన వైద్యుల సదస్సులో సందీప్ పతకం అందుకోగా..ఆయన సన్మాన సభను ఆదివారం స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించారు. ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ సందీప్ తలిదండ్రులు వేము కోటేశ్వరరావు, స్వరూపలను అభినందించారు. అనంతరం డాక్టర్ సందీప్ దంపతులను అతిథులు ఘనంగా సత్కరించారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, మోహనరావు, గొర్రెపాటి గోపీచంద్, నందిగామ ఏసీపీ రవికిరణ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరేష్‌కుమార్, డాక్టర్ ఉప్పాల శ్రీనివాసరావు, ఇంటెలిజెన్స్ ఆఫీసర్ రఘువీర్, మోటమర్రి బాబాప్రసాద్ తదితరులు ప్రసంగించారు.


డాక్టర్ సందీప్ దంపతులను సన్మానిస్తున్న కొల్లు రవీంద్ర, కొనకళ్ల

వర్షం వస్తే.. నరకమే..

అధికారుల పర్యవేక్షణ లోపం ప్రజలకు శాపంగా మారింది. మచిలీపట్నం మూడు స్తంభాల సెంటర్‌లో నిర్మించిన వారధి కింద అండర్ పాస్‌లో వర్షం వస్తే నీరు నిలుస్తోంది. బుధవారం రాత్రి కురిసిన వర్షంతో అండర్‌పాస్ మోకాలి లోతు నీటితో నిండిపోయింది. అండర్‌పాస్‌లో నీరు నిలవకుండా అధికారులు శాశ్వత చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

-భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే


అండర్‌పాస్‌లో నిలిచిన నీరు

నూతన కార్యవర్గం

బంటుమిల్లి, న్యూస్‌టుడే: ఆర్యవైశ్య సంఘం బంటుమిల్లి మండల నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా కొల్లా చంద్రశేఖర్ నియమితులయ్యారు. సంఘం కార్యదర్శిగా వక్కలగడ్డ కరుణకుమార్, కోశాధికారిగా చక్కా నరేంద్ర బాధ్యతలు చేపట్టారు. స్థానిక రామాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ మేరకు జిల్లా నాయకులు నియామక పత్రాలు అందజేశారు.

ఆకట్టుకున్న భజన పోటీలు

ఘంటసాల, న్యూస్‌టుడే: చిట్టూర్పులో రెండు జిల్లాలస్థాయి తాళం భజన పోటీల్లో ఆదివారం కొడాలి, చిట్టూర్పు, బోల్లపాడు, పోలవరం, చిలకలపూడి భక్త బృందాలు పాల్గొన్నాయి. న్యాయ నిర్ణేతలుగా ప్రభాకరరావు, ఏసుపాదం వ్యవహరించారు. పోటీల్లో పాల్గొన్న భజన సమాజాల వారికి జ్ఞాపికలను నిర్వాహక కమిటీ సభ్యులు గుత్తికొండ వరప్రసాద్, దాసరి సతీష్, దాసరి సురేష్, అందజేశారు.

ఉన్నా..ఉపయోగం లేదు

వైకాపా ప్రభుత్వం హయాంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 'ఫిష్ ఆంధ్రా' దుకాణాలు అలంకారంగా మారిపోయాయి. హబ్‌ల నుంచి దుకాణాలకు మత్స్య ఉత్పత్తులను తీసుకువచ్చి ప్రజలకు అందుబాటులో అందించాలన్న లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేశారు. ప్రారంభంలోనే యువత ఆసక్తి చూపకపోవడంతో అప్పటి ప్రభుత్వ ఒత్తిళ్లతో అధికారులు పలు చోట్ల దుకాణాలు ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకున్నారు. వీటిని ఏర్పాటు చేసి ఏడాదిన్నర కావస్తున్నా దుకాణాలు ప్రారంభానికి నోచుకోలేదు. ప్రజాధనాన్ని ఎలా వృథా చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్



శారదానగర్‌లో అలంకారప్రాయం

ఆంబోతుకు అంత్యక్రియలు

బంటుమిల్లి, న్యూస్‌టుడే: మల్లపరాజుగూడెంలో సుమారు 15 ఏళ్లగా సంచరిస్తున్న ఆంబోతును గ్రామస్థులు అక్కున చేర్చుకున్నారు. దానికి వెంకన్న అని పేరు పెట్టి పిలుచుకునేవారు. ఆదివారం ఆంబోతు మృతి చెందింది. దీంతో స్థానికులు కళేబరాన్ని ఊరేగించి శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఇటీవల పిచ్చికుక్క ఆంబోతును కరిచిందని, సకాలంలో వైద్యం అందించే లోగా మృతిచెందిందని గ్రామస్థులు చెబుతున్నారు.


ఊరేగింపు

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

వైద్య శిబిరంలో 400 మందికి సేవలు



మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్

పెనమలూరు, న్యూస్‌టుడే: అనుమోలు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పోరంకిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 400 మంది పేదలకు వైద్యసేవలు అందించినట్లు నిర్వాహకులు తెలపారు. వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ప్రారంభించగా క్యాపిటల్ ఆసుపత్రి వైద్యులు వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ట్రస్టు అధ్యక్షులు అనుమోలు ప్రభాకరరావు ప్రతినెలా అందిస్తున్న సేవలను ఎమ్మెల్యే అభినందించారు. తెదేపా నేతలు సంగెపు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



శిబిరంలో సీఐ వెంకటరమణ, సలివేంద్రశౌరి, ఎస్ఐ ఉషా తదితరులు

కానూరు, న్యూస్‌టుడే: రక్తదానం ప్రాణదానంతో సమానమని పెనమలూరు సీఐ వెంకటరమణ అన్నారు. ఆదివారం కార్మెల్ చర్చి ప్రాంగణంలో ఫాదర్ సలివేంద్రశౌరి, పిన్నమనేని సిద్ధార్థ వైద్య బృందంచే రక్తదానం శిబిరం, ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యశిబిరానికి వచ్చిన వారికి వైద్యులు బీపీ, షుగర్, ఇతర వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందించారు. అనంతరం రక్తదానం చేసిన 40 మంది యువకులకు ప్రశంసాపత్రాలు అందించారు. సుంకరరావు, తాళ్లూరి అశోక్, ఎస్ఐ ఉష, తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు భరోసా

ఉయ్యూరు, పెనమలూరు : ఉయ్యూరుకు చెందిన చలసాని వసంతకుమార్ ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందారు. చికిత్స ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి కోసం ఎమ్మెల్యే బోడే ప్రసాద్ సిఫార్సు చేయగా రూ. 3,42,981 ప్రభుత్వం నుంచి మంజూరయ్యాయి. సంబంధిత చెక్కును బాధితుడికి ఎమ్మెల్యే తన కార్యాలయంలో ఆదివారం అందజేశారు. పట్టణ తెదేపా అధ్యక్షులు గుర్నాధరావు, తెదేపా నాయకుడు కూనపరెడ్డి వాసు తదితరులున్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

పోరంకి, న్యూస్‌టుడే: పోరంకి సెక్షన్ పరిధిలోని 11కేవీ సిద్ధార్థ ఫీడర్ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.హరిబాబు, గుణదల, పోరంకి ఏఈ సాంబశివరావు ఓ ప్రకటనలో తెలిపారు. బీజేఆర్ నగర్ రోడ్డు, నిడమానూరు రోడ్డు, పోరంకి సెంటర్, ప్రభునగర్, శ్రీనగర్ కాలనీ, బందరు రోడ్డు ఏరియా ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు.

పంచాయతీ ప్రజాప్రతినిధులకు శిక్షణ

గన్నవరం గ్రామీణం, పెనమలూరు, న్యూస్‌టుడే: రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ కార్యాచరణ ప్రణాళికను ఎన్నికైన ప్రజాప్రతినిధులకు రెండ్రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో స్వర్ణలత ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. గ్రామ ఉప సర్పంచులు, ఇద్దరు వార్డు సభ్యులకు సోమ, మంగళవారాల్లో పంచాయతీల పరిపాలన, ఏపీపీఆర్ చట్టం 1994పై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆయా ప్రజాప్రతినిధులు పాల్గొనాలని సూచించారు. పెనమలూరు మండలంలోని ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు ఈ నెల 7, 8 తేదీల్లో ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బండి ప్రణవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

అందుబాటులోకి వచ్చేదెప్పుడో?

పూర్తయిన సీఐ కార్యాలయ భవన నిర్మాణం

8 నెలలుగా ప్రారంభంలో జాప్యం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

దాదాపు మూడు దశాబ్దాలుగా అద్దె భవనంలో అరకొర వసతులతో కొనసాగుతున్న హనుమాన్‌జంక్షన్ పోలీసు సర్కిల్ కార్యాలయానికి శాశ్వత భవనం సమకూరినా అందుబాటులోకి తీసుకురావడంలో జాప్యం నెలకొంది. ఏళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమవుతూ వచ్చిన శాశ్వత భవన నిర్మాణం దాతల తోడ్పాటుతో సాకారమైంది. కాకుంటే గత ప్రభుత్వ హయాంలో ఇష్టారీతిన విరాళాలు సేకరించారని, ఇందులో అవకతవకలు చోటుచేసుకున్నాయనే ఆరోపణల నేపథ్యంలో దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే దానిపై అధికారులు, నాయకులు తర్జనభర్జనలు పడుతున్నారు.

రూ.60 లక్షల ప్రజా విరాళాల సేకరణ

హనుమాన్‌నగర్ రాజుల కాలనీలో ఆర్.ఎస్ నంబరు 162/2లో 10 సెంట్ల సామాజిక స్థలాన్ని సీఐ కార్యాలయ శాశ్వత భవనం కోసం గ్రామ పంచాయతీ కేటాయించింది. మండల స్థాయి ప్రజాప్రతినిధులు, వైకాపా నాయకులతో అప్పట్లో నిర్మాణ కమిటీ వేశారు. గతంలో పనిచేసిన సీఐ నరసింహమూర్తి, ఈ కమిటీ ఆధ్వర్యంలో దాదాపు రూ. 60 లక్షలు ప్రజా విరాళాలు సేకరించారు. ఈ మొత్తంతో 8 నెలల వ్యవధిలోనే అధునాతన హంగులతో రెండంతస్తుల్లో భవనం నిర్మించారు. గతేడాది మే 31న శంకుస్థాపన చేయగా, ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి భవనం సిద్ధమైపోయింది.



సిద్ధమైన సొంత భవనం

ముగ్గురు ఎస్పీలు మారినా..

సీఐ కార్యాలయం ఏర్పాటైన నాటి నుంచి అద్దె భవనంలోనే నడుస్తోంది. ప్రస్తుతం ఉన్న అద్దె భవనం ఏమాత్రం అనువుగా లేకపోవడంతో ఎప్పుడెప్పుడు శాశ్వత భవనంలోకి మారుదామా? అని ఎదురు చూస్తున్న సర్కిల్ కార్యాలయ అధికారికి, సిబ్బందికి, భవనం సిద్ధంగా ఉన్నా ఎదురుచూపులు తప్పడం లేదు. గతంలో ఎస్పీగా పనిచేసిన జాషువా శంకుస్థాపన చేయగా, ఆ తర్వాత వచ్చిన నయీం అస్మి ప్రారంభిస్తారని అనుకున్నా ఎందుకనో ఆయన సుముఖత చూపలేదు. ఆ తర్వాత వచ్చిన గంగాధరరావు గత ప్రభుత్వంలో జరిగిన వ్యవహారం కావడంతో దీని ఊసే పట్టించుకోలేదు.



అద్దె భవనంలోనే సీఐ కార్యాలయం

ఆరోపణలే అడ్డంకి?

గత ప్రభుత్వ హయాంలో సీఐగా పనిచేసిన నరసింహమూర్తి ఈ భవన నిర్మాణానికి పూనుకున్నారు. ఈయన వైకాపాకు ఏకపక్షంగా పనిచేశారనే ఆరోపణలున్నాయి. పైగా భవన నిర్మాణానికి దాతల నుంచి విరాళాలు వసూలు చేయడం, వాటిలో కొన్ని పక్కదారి పట్టాయంటూ కూటమి నాయకులు ఆరోపిస్తున్నారు. దీంతో భవనాన్ని ప్రారంభించకుండా ఆపారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అవకతవకలు జరిగి ఉంటే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ప్రజా విరాళాలతో, ప్రభుత్వ స్థలంలో నిర్మించిన భవనం కాబట్టి ప్రారంభించి సీఐ కార్యాలయాన్ని మార్చాలని పలువురు సూచిస్తున్నారు. దీనిపై జిల్లా ఎస్పీ, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

లలితా త్రిపుర సుందరీ.. రక్షమాం..

న్యూస్‌టుడే బృందం: పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. 4వ రోజు ఆదివారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కంకిపాడు మండలం ప్రొద్దుటూరు శివారు గాయత్రి విహార్‌లోని 'శుభగన పతి'కి అదే కాలనీకి చెందిన మధు, అరుణ దంపతులు ఆదివారం రజత కిరీటం, తొండం తదితర ఆభరణాలు బహూకరించారు. జిల్లా భాజపా అధ్యక్షుడు గుత్తికొండ రాజబాబు కంకిపాడు శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



యనమలకుదురు కనకదుర్గమ్మ ఆలయంలో..



పోరంకి సూర్యాలయంలో...



ఉయ్యూరులో ఎం.కె.బాబు విద్యా సంస్థల విద్యార్థినుల సందడి



ఉప్పులూరులో భవానీల పూజలు



శ్రీనివాసనగర్ శిర్డీ ఆలయంలో...



వీరవల్లిమొఖాసాలో..



మద్దూరులో లలితా త్రిపురసుందరీ దేవిగా..



పెద ఓగిరాలలో..



ఏజీకేనగర్‌లోని విజయ దుర్గాదేవి ఆలయంలో



కొత్తపల్లిలో 20 వేల గాజులతో అమ్మవారికి అలంకరణ



గన్నవరం యాదవ రామాలయంలో...



కన్యకాపరమేశ్వరి మందిరంలో..



హనుమాన్‌జంక్షన్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో..



కంకిపాడు: కూచిపూడి నృత్య ప్రదర్శనలో హర్షవిక



ఉంగుటూరు: ఆత్కూరు కనకదుర్గమ్మ..



ప్రసాదంపాడు సాయిబాబా ఆలయంలో..



తాడిగడప రామాలయంలో ..

అంత్యక్రియలకు చేయూత

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: బాపులపాడు బీసీ కాలనీకు చెందిన సైకిల్ మెకానిక్ ఏనుగుల శ్రీరామ్మూర్తి శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. దహన సంస్కారాలకు కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతున్న విషయం తెల్సుకున్న కాకాని బాబు విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికు తీసుకెళ్లగా.. ఆయన సూచనల మేరకు రూ.20 వేల నగదు శ్రీరామ్మూర్తి కుటుంబానికి ఆదివారం ఉదయం అందజేశారు. వార్డు సభ్యులు కడవకొల్లు నాగరాజు, జోగి రామస్వామి, మేకల మరియమ్మ పాల్గొన్నారు.

సేవలకు పురస్కారం

హనుమాన్‌జంక్షన్ : హనుమాన్‌జంక్షన్‌కు చెందిన కమ్మిలి వీరవెంకట సూర్యనారాయణమూర్తికి ఉత్తమ సేవా పురస్కారం లభించింది. మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ జయంతి వేడుకల్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని సిటీ కల్చరల్ కమ్యూనిటీ హాలులో శనివారం కవులు, కళాకారులు, స్వచ్ఛంద సేవకులకు శాంతి సేవారత్న పురస్కారాలు ప్రదానం చేశారు. స్వచ్ఛంద సేవ విభాగంలో సూర్యనారాయణమూర్తికు తెలంగాణ మాజీ మంత్రి వేణుగోపాలాచారి, సినీ నిర్మాత ఎంబీ చౌదరి పురస్కారం అందించారు.

పీఆర్సీ, డీఏ బకాయిలపై దృష్టి పెట్టాలి

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు గత ప్రభుత్వం హయాంలో పీఆర్సీ అమలు, డీఏ బకాయిల విడుదల ఆచరణకు నోచుకోలేదని, కూటమి ప్రభుత్వం వీటిపై దృష్టి పెట్టాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వేగిరెడ్డి సూర్యనారాయణ విజ్ఞప్తి చేశారు. ఆదివారం సాయంత్రం హనుమాన్‌జంక్షన్‌లో విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒకటో తేదీనే జీతాలు, పింఛన్లు ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మిగతా సమస్యల పరిష్కారంపై కూడా త్వరితగతిన కార్యాచరణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుదాఘాతంతో కూరగాయల దగ్ధం

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : ఉంగుటూరు మండలం నందమూరు కూడలి సమీపంలో శంకవరపు నరసమ్మ అనే మహిళ కూరగాయల దుకాణం నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి దుకాణంలో విద్యాదాఘాతంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న పోలీసులు స్థానికుల సాయంతో మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. సుమారు రూ. రెండువేల విలువైన కూరగాయలు దగ్ధమైనట్లు పోలీసులు తెలిపారు.

ఆటో ఢీకొని ఒకరి మృతి

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలం పరిధి పునాదిపాడు-కోలవెన్ను రహదారిలో ఆటో ఢీకొని ద్విచక్ర వాహన చోదకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోలవెన్నుకు చెందిన వణుకూరు పార్థసారథి పునాదిపాడు నుంచి కోలవెన్నుకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఓ ఆటో అతని వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో పార్థసారథికి తీవ్రగాయాలవడంతో విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కంకిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడు..

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: రైల్వే స్టేషన్‌కు వెళుతున్న ఓ వృద్ధుడిని.. ద్విచక్రవాహనం ఢీకొనడంతో మృతి చెందినట్లు గవర్నర్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. నగర శివారులోని తాడిగడపకు చెందిన లింగాచారి (60). . రైల్వేస్టేషన్ వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై ఆదివారం తెల్లవారుజామున బయలుదేరారు. మహాత్మా గాంధీ రోడ్డులో ఠాగూర్ గ్రంథాలయం వద్ద మలుపు తిరుగుతుండగా.. బస్టేషన్ వైపు నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న ముగ్గురు యువకులు ఆయన్ని ఢీ కొట్టారు. నేలపై పడి తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ.. ఉదయం 8 గంటల సమయంలో మృతి చెందారు. దీనిపై గవర్నర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

పెనమలూరు: రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని పెనమలూరు పోలీసులు అరెస్టు చేశారు. వారి వివరాల ప్రకారం.. కొప్పరాజు శ్రీనివాసరావు కంకిపాడు మండలం మాదాసువారిపాలెం నివాసి. అతను శనివారం ద్విచక్రవాహనంపై నాలుగు బియ్యం బస్తాలను తరలిస్తుండగా పోరంకి వద్ద పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ప్రమాణ స్వీకారం నేడు

విజయవాడ బస్టేషన్: ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా పి.ఎస్. మునిరత్నం సోమవారం ఆర్టీసీ హౌస్‌లోని కార్యాలయంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం చేస్తారని ప్రజా సంబంధాల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

వడ్డీ వ్యాపారి దౌర్జన్యం



వీధిలో గుట్టలుగా పడేసిన సామాన్లు

పోరంకి, న్యూస్‌టుడే: అప్పు వసూలు చేసుకునే క్రమంలో ఓ వడ్డీ వ్యాపారి కొంతమంది మహిళలను వెంటబెట్టుకొని కాల్‌మనీ తరహాలో దౌర్జన్యానికి దిగిన ఘటన ఆదివారం పోరంకిలో చోటుచేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. పోరంకికి చెందిన ఇందిరకు ఓ వడ్డీ వ్యాపారి రూ.15 లక్షలు అప్పు ఇచ్చాడు. ఆమె రూ.7 లక్షలు వడ్డీ చెల్లించింది. ఇంకా అసలు కాకుండానే వడ్డీ రూ. 5 లక్షలు రావాలంటూ ఆమె లేని సమయం చూసి వడ్డీ వ్యాపారి పెనమలూరు నుంచి 10 మంది మహిళలను వెంటబెట్టుకుని బృందావనం కాలనీలో ఆమె ఇంటిపై దాడికి దిగారు. యజమాని ఇందిర.. వరద బాధితురాలైన తన స్నేహితురాలు సింగ్‌నగర్‌కు చెందిన ఓ మహిళకు ఆశ్రయం ఇచ్చి ఊరెళ్లింది. ఆమె లేని సమయం చూసి వెంకట్రామ తులసి అపార్ట్‌మెంట్ వద్దకు వచ్చి ఆశ్రయం పొందిన స్నేహితురాలిని కూడా లెక్క చేయకుండా కాల్‌మనీ తరహాలో బయటకు గెంటి దౌర్జన్యం చేసి ఫ్లాట్‌లోని ఇందిర ఇంట్లో సామాన్లు మొత్తం వీధిలో పడేశారు. ఆ సమయంలో కేకలు, అరుపులతో వీధి మొత్తం దద్దరిల్లింది. పోలీసులు గొడవ జరిగిన ఇంటి వద్దకు వచ్చి వెళ్లిపోయారని నివాసితులు తెలిపారు.

బాలుడితో అసభ్య ప్రవర్తన


గన్నవరం గ్రామీణం: ఏడేళ్ల బాలుడితో యువకుడు అసభ్యంగా ప్రవర్తించిన ఘటన గన్నవరం మండలం గొల్లనపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన గోళ్ల పినాకపాణి అనే యువకుడు ఆడుకునేందుకు ఫోన్ ఇస్తానని చెప్పి ఏడేళ్ల బాలుడిని ఆదివారం పిలిచాడు. ఫోన్‌లో ఆడుకుంటున్న బాలుడితో పినాకపాణి అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలుడు విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు.

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

గుడివాడ: 89775 35999 పామర్రు : 80085 74684 అవనిగడ్డ: 80085 74679



? రేమాలవారిపాలెం శివారు పేర్లవానిలంక రామలయం వీధిలో ట్రాన్స్‌ఫార్మర్ సరిగా పనిచేయడం లేదు. దీంతో లో ఓల్టేజ్ కారణంగా లైట్లు, ఫ్యాన్లు సక్రమంగా పనిచేయడం లేదు - **స్థానికులు**

✔సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. **- జి. వెంకటరాజు, విద్యుత్తుశాఖ ఏఈ, నాగాయలంక**

– నాగాయలంక, న్యూస్‌టుడే

'వడ్డెరలను ఎస్టీల్లో చేర్చాలి'

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: వడ్డెర సామాజిక వర్గాన్ని ఎస్టీల్లో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘం జిల్లా నాయకుడు చంద్రగిరి శివనాగమల్లేశ్వరరావు కోరారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం వడ్డెర సంఘం నాయకుడు వడ్డే ఓబన్న వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పించి వడ్డెర హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని నినాదాలు చేశారు. వడ్డెర వృత్తిదారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఓర్సు రాములు, బత్తుల నాగరాజు, సహాయ కార్యదర్శి తమ్మిశెట్టి నాగ తదితరులు పాల్గొన్నారు.

8న ఉద్యోగ మేళా

అవనిగడ్డ, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), జిల్లా ఉపాధి కల్పనా శాఖ, డీఆర్‌డీఏ, సీ-డాప్ సంయుక్తాధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఈనెల 8న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు వి.నరేష్‌కుమార్, జిల్లా ఉపాధి కల్పనాధికారి విక్టర్‌బాబు తెలిపారు. ఈ మేళాలో టెక్నో టాస్క్, బిజినెస్ సొల్యూషన్స్ ప్రయివేటు లిమిటెడ్, ముత్తూట్ మనీ లిమిటెడ్, నవత రోడ్డు ట్రాన్స్‌పోర్టు తదితర కంపెనీలు పాల్గొంటాయి. పది, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తిచేసిన 18 ఏళ్ల నుంచి 29 ఏళ్ల లోపు యువత ఉద్యోగాలకు అర్హులని చెప్పారు. ఎంపికైన వారికి నెలకు రూ.10 వేలు నుంచి రూ.18 వేలు వరకు వేతనం, ఇతర సౌకర్యాలు కల్పిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.5.12 లక్షల విరాళం సమకూరింది. జంగారెడ్డిగూడెం మండలం అయ్యవారి పోలవరానికి చెందిన దోరేటి కాశీవిశ్వేశ్వరరావు రూ.1.01 లక్షలు, కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన జవ్వాది ప్రభాకరరావు రూ.2 లక్షలు ఆలయ కార్యాలయంలో ఆదివారం విరాళాలు అందించారు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలానికి చెందిన వి.ఎం.బంజరకు చెందిన మిట్టపల్లి బాలాజీ రూ.లక్ష, హైదరాబాద్‌కు చెందిన డి.దుర్గ రూ.1.11 లక్షలు విరాళమిచ్చారు. దాతలను ఆలయ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం అభినందించి స్వామివారి ప్రసాదాలు, నిత్యాన్నదాన పత్రాలు అందజేశారు.



దాత జవ్వాది ప్రభాకరరావుకు ధ్రువపత్రం ఇస్తున్న సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం

ఘనంగా అన్నసమారాధన

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గణపతి నవరాత్రి వేడుకల ముగింపు పురస్కరించుకొని గుడివాడ మెయిన్ రోడ్డులోని విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో 10 వేల మందికి ఆదివారం అన్న సమారాధన నిర్వహించారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ బాధ్యుడు బూరగడ్డ శ్రీకాంత్, తెదేపా నాయకులు పిన్నమనేని బాబ్జి, వెనిగండ్ల రామకృష్ణ(నాని), దేవస్థానం ఉత్సవ కమిటీ ఛైర్మన్ శాయన రాజేష్‌తో కలిసి అన్నదానం ప్రారంభించారు. ఆలయ ఈవో యార్లగడ్డ వాసు, ఉత్సవ కమిటీ సభ్యులు విక్కుర్తి పోతురాజు, శలంకాయల లీలా కుమారి, సుశీల, శైలజ, శ్రీనివాస్, నాయకులు మజ్జి శ్రీనివాసరావు, పంద్రాజు సాంబశివరావు, సయ్యద్ జబీన్, పోలాసి ఉమ తదితరులు పాల్గొన్నారు.



అన్నం వడ్డిస్తున్న కమిటీ సభ్యులు

పొంచివున్న ప్రమాదం.. స్పందించని యంత్రాంగం

అత్యంత ప్రమాదకర స్థితిలో వంతెనలు

న్యూస్‌టుడే, మంటాడ (పమిడిముక్కల), తోట్లవల్లూరు

వీరంకిలాకు నుంచి హనుమంతపురం, మల్లంపూడి, వేల్పూరు మీదుగా కనుమూరు చేరే ఆర్ అండ్ బీ రహదారిలో వేల్పూరు వద్ద ఉన్న వంతెన స్లాబు కొంతమేర కూలిపోయి ప్రమాదకరంగా మారింది. ప్రస్తుతం దీనిపై కర్రిపోతే దారి ఉండటంతో ద్విచక్ర వాహనాలు మాత్రమే రాకపోకలు సాగిస్తున్నాయి. ఆ ప్రదేశంలో కూడా బలహీనంగా ఉన్న పైభాగం అడుగున పెచ్చులూడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కావడంతో పొలాలకు ఎలా వెళ్లాలో పాలుపోవడం లేదని రైతులు వాపోతున్నారు. వంతెన క్రమంగా కూలుతోందని స్థానికులు పలు పర్యాయాలు గగ్గోలు పెడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన వద్ద ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని.. కొత్త వంతెన నిర్మించేవరకు వాహనాల రాకపోకల్ని నిషేధిస్తూ రెండు వైపులా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



వేల్పూరు వంతెన దుస్థితి

తోట్లవల్లూరు మండలం పెనమకూరులో ఏనుగుల కోడు డ్రైయిన్‌పై సుమారు 25 అడుగుల ఎత్తున ఉన్న వంతెన అనుసంధాన రహదారులకు రెండు వైపులా రక్షణ గోడలు పూర్తిగా పడిపోగా మరో రిటైనింగ్ వాల్స్ కూడా కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. గ్రామం వైపు రక్షణ గోడ పదేళ్ల కిందట పడిపోయి మార్జిన్ కూడా కోతకు గురై అగాధంలా తయారవడంతో గ్రామస్థులు రెండు తాటి బోదెలు ఏర్పాటు చేశారు. మరోవైపు గోడ పూర్తిగా విరిగిపడిపోయింది. ఇంకో గోడ కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. నిత్యం ఆటోలు, ఇతర వాహనాలు, బస్సులు, పాఠశాల బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇటీవల కింద భాగంలో మట్టి జారిపోయి వంతెన కుంగిందని.. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. ఈ వంతెన కూలిపోతే పలు గ్రామాలకు రవాణా సౌకర్యం తెగిపోతుంది. ఐలూరు, మధురాపురం, గుర్విందపల్లి, దేవరపల్లి, పాములపాటివారిపాలెం, కళ్లంవారిపాలెం, చాగంటిపాడు, ముదిరాజుపాలెం గ్రామాల ప్రజలు ఉయ్యూరు వైపు వెళ్లాలంటే ఈ వంతెన దాటాల్సి ఉంది. పెను ముప్పు సంభవించకుండానే అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



వారధి దక్షిణం వైపు రక్షణ గోడ పడిపోయి కోతకు గురైందిలా..



మట్టి జారి ఇలా..

ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: పేదలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడానికి స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని డాక్టర్ లలిత పేర్కొన్నారు. స్థానిక కోతిబొమ్మ సెంటర్లోని పెరుమాళ్ల గార్డెన్స్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 250 మందిని వైద్యులు పరీక్షించి ఉచిత వైద్య సేవలు అందించారు. సమన్వయకర్త చిట్టినేని సూర్యచంద్రరావు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు టీఎన్.రాజశేఖర్, గంటా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

అడ్డాడ(పామర్రు గ్రామీణం), న్యూస్‌టుడే: అడ్డాడ సీబీఎం చర్చిలో గుడ్‌షెఫర్డ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వైద్యులు గంటా జాన్‌డేవిడ్ ట్విన్స్‌న్, డాక్టర్ కళాసాగర్ పాల్గొని రక్తపోటు, మధుమేహం, గుండె, సాధారణ వ్యాధులతో బాధపడుతున్న 93 మందిని పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. పాస్టర్ కె.రవి, జి.ప్రసాద్‌బాబు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

చెట్లు ప్రగతికి మెట్లు

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణలో చెట్లు ప్రధాన భూమిక పోషిస్తాయని అష్టలక్ష్మి దేవాలయం కమిటీ ఛైర్మన్ బి.సుబ్రమణ్యేశ్వరరావు పేర్కొన్నారు. చిన ఎరుకపాడులోని అష్టలక్ష్మి దేవాలయంలో ఆదివారం ఉపద్రష్ట రాంబాబు వితరణతో 30 మామిడి, జామ, కొబ్బరి మొక్కలు నాటారు. వాకర్స్ ప్రతినిధులు బొగ్గరపు తిరుపతయ్య, పొన్నూరు రామకృష్ణ, సనకా సుబ్బారావు, సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పామర్తి కేశవరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవి ఆలయ ఆదాయం రూ.7.22 లక్షలు

మోపిదేవి: మోపిదేవి శ్రీవల్లీదేవసేనాసమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. దాదాపు 10వేల మంది స్వామికి మొక్కులు సమర్పించి పాలపొంగళ్లు నివేదించి పూజల్లో పాల్గొన్నారు. ఆదివారం రూ7.22లక్షల ఆదాయం సమకూరినట్లు డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామవరప్రసాద్ తెలిపారు.



దర్శనానికి బారులు తీరిన భక్తులు

ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ

పమిడిముక్కల, న్యూస్‌టుడే: మండలం పరిధిలోని పంచాయతీ ఉప సర్పంచులకు, వార్డు సభ్యులకు సోమవారం నుంచి ఈ నెల 10 వరకు మండల పరిషత్తు కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ కార్యాచరణ మేరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో విఠల్‌పాల్ తెలిపారు. ప్రతి పంచాయతీ నుంచి ఉప సర్పంచి, ఒక మహిళా, ఒక పురుష వార్డు సభ్యులు (మొత్తం ముగ్గురు చొప్పున) 7,8 లలో మొదటి బ్యాచ్‌నకు, 9, 10 లలో రెండో బ్యాచ్‌నకు రెండు రోజులు చొప్పున శిక్షణ ఇస్తామన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు.

రహదారి.. గుంతలమయంగా మారి..



పంట కాలువ పక్కన ధ్వంసమైన మార్గం



భారీ వాహనాల రాకపోకలు

చేపల చెరువుల వాహనాల రాకపోకలతో కోడూరు మండల పరిధిలోని 15వ నంబరు పంటకాలువ పక్కన రహదారి ధ్వంసమైందని ఆ ప్రాంతంలోని పంట పొలాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 3 కిలోమీటర్ల పొడవు గల ఈ రహదారికి చివరలో సుమారు 150 ఎకరాల్లో చేపల చెరువులు సాగు చేస్తున్నారు. చేపల మేత, తదితరాలు రవాణాకు భారీ వాహనాలు తిరుగుతుండడంతో ఈ రహదారి గుంతలమయంగా తయారైందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి పల్లంగా ఉండడంతో సుమారు 300 ఎకరాల్లో వరి సాగు చేసే రైతులు గతంలో చందాలు వేసుకొని అభివృద్ధి చేసుకున్నారు. ఆ తర్వాత ఇరిగేషన్ శాఖ అధికారుల దృష్టికి రహదారి సమస్య తీసుకువెళ్లగా రూ.40 లక్షలు వెచ్చించి జీఎస్‌పీ రహదారిగా అభివృద్ధి చేశారని రైతులు చెప్పారు. ఈ రహదారిని అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కోడూరు (అవనిగడ్డ)

గడ్డివాము దగ్ధం

ఘంటసాల, న్యూస్‌టుడే: ఘంటసాల ఘోటకం 'ఏ' కాలనీలో విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్‌తో రైతు గాజుల శివకోటేశ్వరరావుకు చెందిన 10 ఎకరాల గడ్డివాము ఆదివారం దగ్ధమైంది. అవనిగడ్డ అగ్నిమాపక ఇన్‌ఛార్జి అధికారి బి.బాల మురళీకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రూ.1.30లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అగ్నిమాపక అధికారులు అంచనా వేశారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

కూచిపూడి, న్యూస్‌టుడే: కూచిపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వేములమడలో కోడిపందేలు ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామని కూచిపూడి ఎస్సై ఎం.సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. వారితో పాటు రూ.6,730 నగదు, ఒక పుంజును స్వాధీనం చేసుకున్నామని, వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మోపిదేవి, న్యూస్‌టుడే: కె.కొత్తపాలెం నుంచి మచిలీపట్నం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును 216 జాతీయ రహదారిపై పెదప్రోలు వద్ద ఎస్సై, సిబ్బంది ఆదివారం పట్టుకున్నారు. ఎటువంటి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నందుకు ట్రాక్టరు పట్టుకుని పోలీస్‌స్టేషన్ వద్ద అదుపులో ఉంచినట్లు ఎస్సై వీర వెంకట సత్యనారాయణ తెలిపారు.

మూత్రపిండాల బాధితులకు ఆర్థిక సాయం

చల్లపల్లి, న్యూస్‌టుడే: రావెళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. చల్లపల్లి నారాయణరావునగర్‌కు చెందిన సుభానీకు రెండు కిడ్నీలు పాడై కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరగాల్సి ఉండడంతో రావెళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఛైర్మన్ రావెళ్ల ఉదయ్‌కుమార్ రూ.25వేలు ఆర్థికసాయం అందించారు. విశాఖపట్నంలో ఫౌండేషన్ సభ్యులు నరసింహారావు ద్వారా క్యాన్సర్‌తో బాధపడుతున్న భాగ్యలక్ష్మికి రూ.10వేలు సాయం అందించారు. ఫౌండేషన్ సభ్యులు సురేష్‌బాబు, శివ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులకు అవగాహన

కోడూరు (అవనిగడ్డ): పాలకాయతిప్ప బీచ్ వద్ద స్నానాలు చేయడానికి వచ్చిన యాత్రికులు తప్పకుండా జాగ్రత్తలు పాటించాలని మెరైన్ సీఐ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సందర్శకులకు సూచనలు చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే బీచ్‌కు అనుమతిస్తామన్నారు. గుంతలు ఉన్న కారణంగా సాగరసంగమ ప్రదేశానికి అనుమతి లేదని చెప్పారు. సముద్రంలో సుడిగుండాలున్న కారణంగా 12 అడుగులకు మించి లోపలకు వెళ్లరాదన్నారు. చిన్న పిల్లలను ఒంటరిగా బీచ్ వద్ద వదలరాదని చెప్పారు. మెరైన్ ఎస్సై ఉజ్వల్‌కుమార్, ఏఎస్ఐ నగేష్ సిబ్బంది పాల్గొన్నారు.



యాత్రికులకు సూచనలు చేస్తున్న మెరైన్ పోలీసులు



చిన ఎరుకపాడులో..



గుడివాడ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో..



గుడివాడ : కాశీవిశ్వేశ్వర స్వామిగా..



పామర్రు : లలితా త్రిపురసుందరిగా..



పామర్రు : సంతానలక్ష్మిగా..



కొండిపర్రులో



పామర్రు : అన్నపూర్ణాదేవిగా



గుడివాడ భీమేశ్వర స్వామి దేవస్థానంలో..

అన్నపూర్ణే.. సదాపూర్ణే..

దసరా నవరాత్రి వేడుకలు గుడివాడ, పామర్రు, అవనిగడ్డ నియోజకవర్గాల్లో ఆదివారం వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించారు. పలు చోట్ల ముత్తయిదువ, సుహాసిని పూజలు, చండీయాగం, శ్రీచక్రార్చనలు, స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో, ప్రత్యేక పందిళ్ల వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. – న్యూస్‌టుడే బృందం



అవనిగడ్డ విద్యానికేతన్ పాఠశాలలో దేవతా మూర్తుల వేషధారణలో..



కూచిపూడిలో..



నాగాయలంక : గంగానమ్మ తల్లి



చల్లపల్లిలో మహాచండీదేవిగా..



అర్థాకాయపాలెం రామాలయం వద్ద



వేకనూరులో..



మందపాకలలో..



పెదపారుపూడి : వెంట్రప్రగడలో



నాగాయలంకలో..



శ్రీరామపాద క్షేత్రంలో..



పమిడిముక్కల: గురజాడలో..



అవనిగడ్డ రెండో వార్డులో..



అవనిగడ్డలో



తోట్లవల్లూరులో..



గుడివాడ : గౌరీశంకరపురంలో..



గుడివాడ : పెద్ద వీధిలో..

ద్విచక్ర వాహనాలు ఢీ.. తల్లి దుర్మరణం

తండ్రీ కుమార్తెల పరిస్థితి విషమం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో తల్లి మృతి చెందగా, తండ్రి, మరో కుమార్తె పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల కథనం ప్రకారం.. ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం వణుదుర్రుకు చెందిన మైనాకు విజయవాడకు చెందిన కిరణ్‌తో ఆరేళ్ల కిందట వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు. విజయవాడ నుంచి భర్త, కుమార్తెలతో మైనా వణుదుర్రులోని పుట్టింటికి రెండ్రోజుల కిందట వచ్చింది. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో తిరిగి ద్విచక్ర వాహనంపై విజయవాడకు బయలుదేరారు. సింగరాయపాలెం పెట్రోలు బంక్ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం వీరి వాహనాన్ని బలంగా ఢీకొంది. ప్రమాదంలో మైనా(25) అక్కడికక్కడే మృతి చెందగా, భర్త కిరణ్, అయిదేళ్ల పెద్ద కుమార్తె, మరో ద్విచక్రవాహనంపై ఉన్న యువకుడిని 108లో గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలిలో ఉన్న చిన్న కుమార్తె పరిస్థితి విషమంగా ఉండటంతో ఎస్సై వెంకటకుమార్, సిబ్బంది వారి వాహనంలో ముదినేపల్లిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి గుడివాడ తరలించడానికి 108 కోసం ఎంత ప్రయత్నించినా అవి అందుబాటులోకి రాలేదు. చివరికి సింగరాయపాలెంలోని ఓ పరిశ్రమకు చెందిన అంబులెన్స్‌లో గుడివాడ ఆసుపత్రికి తరలించారు. మరో ద్విచక్ర వాహనంపై ఇద్దరు యువకులు ఉన్నట్లు సమాచారం. బంటుమిల్లి మండలం మల్లపరాజుగూడేనికి చెందిన వారుగా స్థానికులు భావిస్తున్నారు.

ఆకట్టుకున్న భజన పోటీలు

ఘంటసాల,న్యూస్‌టుడే: చిట్టూర్పులో రెండు జిల్లాలస్థాయి తాళం భజన పోటీల్లో ఆదివారం కొడాలి, చిట్టూర్పు, బోళ్లపాడు, పోలవరం, చిలకలపూడి భక్త బృందాలు పాల్గొన్నాయి. న్యాయ నిర్ణేతలుగా ప్రభాకరరావు, ఏసుపాదం వ్యవహరించారు. పోటీల్లో పాల్గొన్న భజన సమాజాల వారికి జ్ఞాపికలను నిర్వాహక కమిటీ సభ్యులు గుత్తికొండ వరప్రసాద్, దాసరి సతీష్, దాసరి సురేష్, అందజేశారు.



పోటీలో పోలవరం మహిళా భజన సమాజం

అష్టలక్ష్ములు.. ఆరాధ్య దేవతలు

కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక ప్రాధాన్యం


ఆదిలక్ష్మిని అర్చించడం ద్వారా భక్తుడికి మహాలక్ష్మి అనుగ్రహం లభిస్తుంది


సంతాన లక్ష్మి ద్వారా యోగ్యవంతులైన సంతానం కలుగుతుంది


గజలక్ష్మి అనుగ్రహంతో ప్రశాంతత చేకూరుతుంది


ధాన్యలక్ష్మి అనుగ్రహంతో సకల జీవరాశికి ఆహారం లభ్యమవుతుంది

ఇంద్రకీలాద్రిపై స్వయంభువుగా వెలిసిన కనకదుర్గమ్మ ఆలయ చరిత్ర కృతయుగం నాటిది. త్రేతా యుగంలో శ్రీరామచంద్రుడు, ద్వాపర యుగంలో అర్జునుడు అమ్మవారిని కొలిచినట్లు స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. శ్రీకృష్ణదేవరాయులు పరిపాలనా కాలంలో ఆలయాన్ని అభివృద్ధి చేసినట్లు కొన్ని రాతి శాసనాలు స్పష్టం చేస్తున్నాయి. అనంతర కాలంలో ప్రస్తుత ఆలయాన్ని గ్రానైట్‌తో పటిష్ఠంగా నిర్మించారు. పల్లవుల శిల్ప రీతిలో చిత్రవాణం, అధిష్ఠానం, స్తంభ వర్గం, కుడ్యకోష్ఠం, ప్రస్తరం, కర్ణకూటం, ప్రస్తార వేదిక, కంఠం, శిఖరం, కలశాలను ఏర్పాటు చేశారు.

కుడ్య కోష్ఠంలో అష్టలక్ష్ములు ప్రత్యేక ఆకర్షణ.. మహా కాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి అంశలతో ఏర్పాడిన రూపం జగన్మాత దుర్గమ్మ. దుర్గమ్మ ప్రధాన ఆలయ కుడ్య కోష్ఠంలో అష్టలక్ష్ములు ప్రత్యేక ఆకర్షణ. దుర్గమ్మ ప్రధాన ఆలయం చుట్టూ గోడలో వరుసగా ఆది లక్ష్మి, సంతాన లక్ష్మి, గజలక్ష్మి, ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి, విజయలక్ష్మి, ఐశ్వర్యలక్ష్మి, వీరలక్ష్మి విగ్రహాలను ఏర్పాటు చేశారు. 1999 ఏప్రిల్ 19 నుంచి 22 వరకు తయాహ్నికంగా నాటి కంచి కామకోటి పీఠాధిపతులు జయేంద్ర సరస్వతి సువర్ణ శిఖరాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా మహాకుంభాభిషేకం నిర్వహించారు. గతంలో ఆదిలక్ష్మికి ప్రణమిల్లి ప్రదక్షిణ చేసిన తరువాత దుర్గమ్మను దర్శించుకునేవారు. ప్రస్తుతం భక్తుల సంఖ్య గణనీయంగా పెరగడంతో అష్టలక్ష్ములను దర్శించుకునే అవకాశం లేకుండా పోయింది. అర్చకులు మాత్రం జగన్మాత దుర్గమ్మతోపాటు అష్టలక్ష్ములకు నిత్యం పూజ చేసి నివేదన సమర్పిస్తున్నారు. **- ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే**


ధనలక్ష్మిని పూజిస్తే మానవులకు అవసరమైన ధనానికి లోటు ఉండదు.


విజయలక్ష్మిని పూజిస్తే ఆమె చల్లని చూపుతో సకల కార్యాల్లో సాధకులకు విజయం సిద్ధిస్తుంది.


ఐశ్వర్య లక్ష్మి అనుగ్రహంతో అష్టైశ్వర్యాలు లభిస్తాయి.


వీరలక్ష్మి(ధైర్యం) మనతో ఉంటే ఎలాంటి క్లిష్ట పరిస్థితులనైనా ఎదుర్కొనే శక్తి అభిస్తుంది. తద్వారా మిగతా లక్ష్ములు కూడా అండగా నిలుస్తారని దేవస్థానం పురాణ పండిట్ వెంకటేశ్వర శర్మ తెలిపారు.

విశిష్టం.. ఉపాలయాల దర్శనం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

దసరా ఉత్సవాల్లో ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను దర్శించుకునేందుకు దూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు వస్తుంటారు. అయితే ఇంద్రకీలాద్రిపై అమ్మవారి ఆలయంతోపాటు మరికొన్ని ఉపాలయాలు సైతం ఎంతో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకొని పూజలు చేస్తే చేపట్టిన విజయవంతం అవుతాయని భక్తుల విశ్వాసం. ఇంద్రకీలాద్రిపై ఉపాలయాలైన మల్లేశ్వరాలయం, నటరాజస్వామి ఆలయం, క్షేత్రపాలక ఆంజనేయస్వామి ఆలయాలకు విశిష్ట ఆదరణ ఉంది. ప్రాచీన కాలంలో మల్లేశ్వరాలయాన్ని నిర్మించారు. మల్లేశ్వరాలయంలో క్షేత్రపాలకుడు కాలభైరవుడు, నందీశ్వరుడి దర్శనం తరువాత స్వామి వారిని దర్శించుకుంటారు.

మల్లేశ్వరాలయం

కృత యుగంలో చతుర్ముఖుడైన బ్రహ్మదేవుడు ఇక్కడ స్వామి వారిని మల్లికా పుష్పాలతో పూజించడంతో మల్లేశ్వరుడు అని పేరు వచ్చినట్లు పండితులు చెబుతున్నారు. దాతల సహకారంతో 2017 నుంచి ఆలయ పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. దాత సంకా నరసింహారావు రూ.5కోట్ల వ్యయంతో మల్లేశ్వరాలయాన్ని 200 మీటర్లు విస్తరణకు సహకరించారు. దుర్గమ్మ దర్శనం చేసుకున్న భక్తులు మల్లేశ్వరాలయాన్ని సందర్శించి కనకదుర్గానగర్ వెళ్లేందుకు విశాలమైన మెట్ల మార్గాన్ని అభివృద్ధి చేశారు. గడ్డర్లతో మల్లేశ్వరాలయాన్ని విస్తరించారు. తరువాత రూ. 6కోట్ల వ్యయంతో దేవస్థానం మల్లేశ్వరాలయ పునర్నిర్మాణ పనులు చేసింది. ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేయడంతోపాటు ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం దుర్గమ్మను దర్శించుకున్న భక్తులు మల్లేశ్వర స్వామిని దర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేశారు.



నాట్యకళా కేంద్రంగా నటరాజస్వామి ఆలయం



ఇంద్రకీలాద్రిపై వినాయక నటరాజ శివకామ సుందరీదేవి ఆలయానికి ప్రత్యేకత ఉంది. చక్కటి శిల్పకళా నైపుణ్యంతో కూడిన మండపంతో ఈ కోవెలను తీర్చిదిద్దారు. మొదటి ఆలయంలో వినాయకుడు, రెండో ఆలయంలో నటరాజస్వామి, మూడో ఆలయంలో శివకామసుందరీదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. దుర్గామల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకున్న భక్తులు ఇక్కడ కొంత సేద తీరేవారు. గతంలో ఇక్కడ కళాప్రదర్శనలు ఇచ్చేవారు. ప్రస్తుతం దేవస్థానంలోని రాజగోపుర ప్రాంగణంలో కళావేదిక ఏర్పాటు చేయడంతో కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఈ ఉపాలయం పరిమితమైంది.

నాగేంద్ర స్వామి పుట్ట వద్ద సుబ్రహ్మణ్య స్వామి ఆలయం



నాగేంద్ర స్వామి పుట్ట వద్ద నాగుల చవితికి పాలు పోసేందుకు మహిళా భక్తులు తరలివస్తారు. నిత్యం భక్త జన సంచారం ఉండేందుకు వీలుగా ఇక్కడ శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయాన్ని నిర్మించారు. తల్లిని దర్శించుకున్న భక్తులు తనయుడైన సుబ్రహ్మణ్యుడి ఆశీస్సులు తీసుకునేందుకు ఇక్కడికి వస్తారు. ప్రతి నెల సుబ్రహ్మణ్య షష్ఠి రోజున స్వామి వారి కల్యాణానికి విశేష ఆదరణ ఉంది.

క్షేత్ర పాలక ఆంజనేయ స్వామికి బంగారు కవచం

ఏ క్షేత్రంలోనైనా తొలుత క్షేత్రపాలకుడి దర్శనం పూర్తి చేసుకున్న తరువాత మాత్రమే క్షేత్ర దేవుడిని దర్శించుకుంటారు. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనం చేసుకునే భక్తులు కూడా తొలుత క్షేత్రపాలకుడిని దర్శించుకునే వారు. కాలక్రమంలో భక్తుల సంఖ్య గణనీయంగా పెరగడంతో క్యూలైన్లు వేయడంతో భక్తులు క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామిని దర్శించుకునే అవకాశం లేకుండా పోయింది. ఉచిత దర్శన క్యూలో వచ్చే భక్తులకు మాత్రం ఈ వాయుపుత్రుడి దర్శనం లభిస్తుంది. క్షేత్రపాలకుని విశిష్టతను గుర్తించి దాతలు రూ. కోట్ల విలువ చేసే బంగారు కవచం, కిరీటాన్ని గత ఏడాది అందజేశారు. ఘాట్ రోడ్డులో ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద నడచి వచ్చే భక్తులు మాత్రమే దర్శించుకుంటున్నారు.

ఘాట్ రోడ్డు ముఖద్వారంలో..

దుర్గమ్మ దర్శనానికి ఘాట్ రోడ్డు మార్గంలో వచ్చే భక్తులు కామధేను అమ్మవారిని దర్శించుకుంటారు. కోరిన వరాలు ఇచ్చే దుర్గమ్మ దర్శనానికి నేరుగా రాలేని వారి కోసం జాతీయ రహదారి పక్కన కామధేను శిల్క్స్ వారు ఇక్కడ వినాయకుడి ఆలయంతోపాటు అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. జాతీయ రహదారిపై వెళ్లే వారు కామధేను అమ్మవారిని దర్శించుకుంటారు. రెండు ఆలయాలకు కలిపి మండపాన్ని నిర్మించి నిత్యం నివేదనార్చనను రుత్వికులు నిర్వహిస్తున్నారు

నేటి అలంకారం 7-10-2024, సోమవారం

శ్రీ మహా చండీ దేవి

శరన్నవరాత్రి మహోత్సవాలలో ఐదోరోజు కనకదుర్గమ్మ శ్రీ మహాచండీ దేవిగా దర్శనమిస్తారు. దేవతల కార్యసిద్ధి, దుష్టశిక్షణ, శిష్ట రక్షణ కొరకు మహాలక్ష్మీ, మహాకాళీ, మహా సరస్వతి త్రిశక్తి స్వరూపిణిగా శ్రీ మహాచండీ అమ్మవారు ఉద్భవించింది. శ్రీ చండీ అమ్మవారిలో అనేక మంది దేవతలు కొలువై ఉన్నారు. శ్రీ మహాచండీ అనుగ్రహం వలన విద్య, కీర్తి, సంపదలు లభించి శత్రువులు మిత్రులుగా మారటం, ఏ కోరికలతో ప్రార్థిస్తామో ఆ కోరికలు అన్నీ సత్వరమే లభిస్తాయని భక్తజనుల నమ్మకం.


దేవానాం కార్యసిద్ధ్యర్థం ఆవిర్భవతి సా యదా! ఉత్పన్నేతి తదా లోకే సానిత్యాప్యభిధీయతే!

దేవాదాయ శాఖలో సమూల మార్పులకు చర్యలు


మంత్రి ఆనం రామనారాయణరెడ్డి


మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పక్కన కమిషనర్ సత్యనారాయణ, ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దేవాదాయ శాఖలో సమూల మార్పులకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. దసరా వేడుకల్లో ఆదివారం లలితాత్రిపుర సుందరీ దేవి అలంకారంలో ఉన్న జగన్మాత దుర్గమ్మను ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయ సాంప్రదాయల విషయంలో అధికారులు జోక్యం చేసుకోవద్దని సూచించారు. దేవతామూర్తులకు జరిగే కైంకర్యాలు ఆగమ సాంప్రదాయం ప్రకారం నిర్వహించాల్సిందేనని స్పష్టం చేశారు. ఆగమశాస్త్రానికి విరుద్ధంగా అధికారులు నిర్ణయాలు తీసుకోవద్దన్నారు. ధూప, దీప నైవేద్యాల కింద రూ. 50వేల వార్షిక ఆదాయం కలిగిన ఆలయాలకు రూ. 10 వేల మొత్తాన్ని ఇస్తామన్నారు. ట్రస్టుబోర్డులో సైతం బ్రాహ్మణులు, నాయిబ్రాహ్మణులకు చోటు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దీని కోసం అవసరమైతే శాసనసభలో తీర్మానం చేసి చట్ట సవరణ చేస్తామన్నారు. దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, ఈవో రామారావు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో ఆదాయం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాల్లో నాలుగో రోజు ఆదివారం రికార్డు స్థాయిలో రూ. 66.33 లక్షల ఆదాయం లభించింది. లలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో ఉన్న జగన్మాత దుర్గమ్మను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. క్యూలైన్లో బారులు తీరిన వేలాది భక్తులు అమ్మవారిని దర్శించుకున్న తరువాత ప్రసాదాల కౌంటర్ల వద్దకు చేరడంతో రద్దీ ఏర్పడింది. ఒక దశలో ప్రసాదం అందుతుందో లేదోనన్న ఆందోళన అధికారుల్లో కనిపించింది. లడ్డూల విక్రయం ద్వారా రూ. 22.16లక్షలు, రూ. 500, రూ. 300, రూ. 100 దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 28.82 లక్షలు, రూ. 8.82లక్షలు, రూ. 5.39 లక్షల ఆదాయం వచ్చింది. 2,892 మంది తలనీలాల సమర్పించారు. తద్వారా దేవస్థానానికి రూ. 1.14 లక్షలు ఆదాయం లభించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.



ఆరు నిమిషాల్లో అమ్మవారి చరిత

అబ్బుర పరిచిన లేజర్ షో


తపస్సు చేస్తున్న కీలుడు


బ్రహ్మదేవుని వరం పొంది లోకాలను కబళించేందుకు వెళ్తున్న మహిషాసురుడు


మహిషాసురుడిని సంహరించేందుకు వచ్చిన దుర్గామాత


శివుడు మల్లేశ్వరుడిగా.. ఇంద్రకీలాద్రిపై లింగం ఆకారంలో వెలసి..


కనకదుర్గమ్మగా దర్శనమిచ్చిన అమ్మవారు


కృష్ణవేణి ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన లేజర్ షో

ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ ఆలయ ప్రాశస్త్యాన్ని సుమారు ఆరు నిమిషాల్లో లేజర్ షో ద్వారా ప్రదర్శిస్తున్నారు. విజయవాడ కృష్ణవేణి ఘాట్ వద్ద సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు ఇంద్రకీలాద్రిపై నిత్యం ఈ లేజర్ షో ప్రదర్శిస్తున్నారు. ఆలయ చరిత్రను తెలిపే సన్నివేశాలతో రంగురంగుల లేజర్ లైట్లతో షో కనువిందు చేస్తోంది. క్యూలైన్లు, కనకదుర్గ పైవంతెన, రోడ్డుపై నుంచి ఈ ప్రదర్శనను భక్తులు తిలకించి పులకించిపోతున్నారు. కీలుడు తపస్సు చేయడం, మహిషాసురుడిని అమ్మవారు సంహరించడం.. శివుడు మల్లేశ్వరుడిగా ఇంద్రకీలాద్రిపై వెలిసిన దృశ్యాలను ప్రదర్శిస్తున్నారు. **-ఈనాడు, అమరావతి**

ఆర్జిత సేవల భక్తులకు అడ్డంకులు



దాతల లాంజ్ వద్ద భక్తులను ఆపిన పోలీసులు


కుంకుమార్చన పూజకు వెళ్లే మార్గంలో ఇలా..


వీఐపీ పాసులున్న వారిని నిలిపివేసిన పోలీసులు

చిట్టినగర్, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపైకి వ్యయప్రయాసలకోర్చి ఆర్జిత సేవల పూజలకు వచ్చే భక్తులకు పోలీసు అడ్డంకులు తప్పడం లేదు. టిక్కెట్లు తనిఖీ చేసి పంపడం వరకు ఇబ్బంది లేదు. తనిఖీ పేరుతో వారిని అడ్డుకోవడంతో పూజలకు ఆలస్యం అవుతోందని, అడిగితే ముందుగా రావాలంటున్నారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీఐపీల పేరుతో వచ్చే వారితో పాటు తమను కూడా ఎందుకు ఆపుతున్నారని ఉభయదాతలు పోలీసులను ప్రశ్నించినా పట్టించుకోని పరిస్థితి ఆదివారం ఉదయం కనిపించింది. ప్రధానంగా దాతల లాంజ్ వద్ద చేతిలో టిక్కెట్లు ఉన్నా పంపకుండా నిలిపేశారు. ఆగ్రహం వ్యక్తం చేయడంతో అప్పుడు పంపారు. దాతల లాంజ్ నుంచి చిన రాజగోపురం వద్దకు రాగా, అక్కడ కూడా ఇదే పరిస్థితిని వారు ఎదుర్కొన్నారు. అందరినీ ఒకే మార్గంలో పంపడంతో సమస్య తలెత్తుతోంది. అలా కాకుండా ఈవో పేషీ వైపు మార్గంలో కుంకుమ పూజ, ఇతర పూజలకు చెందిన భక్తులను పంపితే ఎలాంటి ఇబ్బంది లేకుండా సకాలంలో పూజలకు హాజరయ్యే అవకాశం ఉంటుంది. పోలీసు అధికారులు ఆ దిశగా ఆలోచించి చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

కన్వేయర్ బెల్ట్‌తో పారిశుద్ధ్య సమస్యకు తెర


కృష్ణవేణి ఘాట్ వద్ద కన్వేయర్ బెల్ట్



బెల్ట్‌కు చివరి భాగంలో వాహనం ఏర్పాటు

కృష్ణలంక, న్యూస్‌టుడే: దసరా వేడుకల్లో భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకుని ఘాట్‌లో పారిశుద్ధ్యాన్ని నిర్వహించేందుకు నగర పాలక సంస్థ కృష్ణవేణి ఘాట్‌లో కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం భక్తుల రాక తక్కువగా ఉన్నప్పటికీ వేడుకల చివరి రోజుల్లో అధిక సంఖ్యలో భవానీలు తరలివచ్చే అవకాశం ఉంది. వీరందరూ ఘాట్ సమీపంలో ఏర్పాటు చేసిన కేశఖండన శాలలో మొక్కులు చెల్లించుకుని స్నానాలకు తరలివస్తారు. అనంతరం వారు దీక్షా వస్త్రాలను ఘాట్‌లో ఎక్కడపడితే అక్కడ విడిచిపెడుతుంటారు. దీంతో పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. దీనిని పరిగణనలోకి తీసుకుని గతేడాది నగర పాలక సంస్థ ఈ ఘాట్‌లో కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు చేసింది. ఇక్కడ విడిచిన వస్త్రాలను అక్కడి సిబ్బంది సేకరించి వాటిని కన్వేయర్ బెల్ట్ మీదకు చేరుస్తారు. దీని చివరి భాగంలో ఏర్పాటు చేసిన వాహనంలో వాటిని నింపి తరలిస్తారు. దీనివల్ల అక్కడ పారిశుద్ధ్యం బాగుండడంతో పాటు వస్త్రాలను సేకరించే ప్రయాస కార్మికులకు తగ్గుతుంది. ఇదే విధానంలో భవానీ దీక్షా విరమణల సమయంలో వస్త్రాలను తరలిస్తున్నారు.

ఏమరపాటుతో తప్పదు అనర్థం

కన్వేయర్ బెల్ట్ ఉపయోగం ఉన్నా ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా అనర్థాలు కూడా దాపురించే అవకాశం ఉంది. దీనిని ఘట్ మధ్య భాగంలో ఏర్పాటు చేయడంతో పుణ్యస్నానాలకు విచ్చేసే భక్తులు అటు.. ఇటు రాకపోకలు సాగించే క్రమంలో బెల్ట్ కింద నుంచి దూరి వెళుతున్నారు. బెల్ట్ ఆగి ఉంటే ఇబ్బంది ఉండదు. . కానీ ఒకవేళ అది పనిచేస్తున్నప్పుడు భక్తులు అక్కడ ఉంటే ప్రమాదాలకు ఆస్కారం ఉంది.

జగన్మాత ఆశీస్సులతో ప్రజలకు మంచి పాలన అందాలి


నటి కాదంబరి జెత్వాని

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : జగన్మాత దుర్గమ్మ ఆశీస్సులతో ప్రజలకు మంచి పాలన అందాలని కోరుకున్నట్లు నటి కాదంబరి జెత్వాని అన్నారు. ఇంద్రకీలాద్రిపై లలితా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మను ఆదివారం దర్శించుకున్నారు. పోలీసు రక్షణతో ఆమె దుర్గమ్మ దర్శనం చేసుకున్నారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దసరా ఏర్పాట్లు బాగా చేసిందన్నారు. నవరాత్రుల్లో అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇతర ఆలయాల్లో కూడా ఇదే తరహాలో ఏర్పాట్లు చేస్తే బాగుంటుందన్నారు. మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తన వ్యవహారంలో న్యాయం చేస్తుందన్న నమ్మకం కలిగిందని చెప్పారు.

పక్కాగా.. భక్తుల లెక్క


కమాండ్ కంట్రోల్‌లో సీసీ టీవీ పర్యవేక్షిస్తూ..


దర్శనం చేసుకుని వచ్చే భక్తులను లెక్కిస్తూ..

ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను శరనవరాత్రుల్లో దర్శనానికి తరలి వస్తున్న భక్తులు ఎంతమంది వచ్చారో క్షణాల్లో తెలుసుకునేందుకు పోలీస్ యంత్రాంగం ఒక ప్రత్యేక సిస్టమ్‌ను ఏర్పాటు చేసింది. దుర్గ ఘాట్ పక్కనే ఉన్న కమాండ్ కంట్రోల్ రూం నుంచి యంత్రాంగం భక్తుల సంఖ్యను పర్యవేక్షిస్తోంది. అమ్మవారి దర్శనం చేసుకుని భక్తులు బయటకు వచ్చే మార్గంలో లైవ్ స్ట్రీమింగ్ సీసీ ఫుటేజీ నుంచి ఆల్‌గారిథమ్ పద్ధతి ద్వారా పెద్దలు, పిల్లలు వేరు చేస్తూ.. రెడ్ లైన్ దాటగానే లెక్కిస్తుంది. ఆదివారం ప్రయోగాత్మకంగా ఈ పద్ధతిని పర్యవేక్షించారు. సోమవారం నుంచి ఈ పద్ధతి ద్వారా అమ్మవారి దర్శనానికి ఎంత మంది భక్తులు వచ్చారో ప్రతి గంటకు తెలుసుకునే వీలు ఉంటుందని అధికారులు తెలిపారు. **- ఈనాడు, అమరావతి**

దుర్గమ్మ సేవలో ప్రముఖులు


మంత్రి సంధ్యారాణికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న డిప్యూటీ ఈవో రత్నంరాజు


దర్శనానికి వస్తున్న చిత్ర నిర్మాత దిల్‌రాజు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల్లో లలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో ఉన్న జగన్మాత దుర్గమ్మను ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కృష్ణా జిల్లా ప్రిన్సిపల్ జడ్జి అరుణ సారిక, రాష్ట్ర మంత్రి సంధ్యారాణి, చిత్ర నిర్మాత దిల్‌రాజు, సీపీ రాజశేఖర్‌బాబు వేర్వేరుగా జగన్మాత దుర్గమ్మను దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన వారికి దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దసరా ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నాయని వారు తెలిపారు. జనసమూహం నడుమ అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని మంత్రి సంధ్యారాణి తెలిపారు. వారికి దేవస్థానం అధికారులు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.


ఆశీర్వచన మండపంలో సీపీ రాజశేఖర్‌బాబు దంపతులు


కృష్ణా జిల్లా ప్రిన్సిపల్ జడ్జి అరుణసారిక